# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janasakthionline.com

సంపుటి : 47 సంచిక : 7, 8 విజయవాడ 20-8-2014 పేజీలు : 8 వెల : రు 5.00


లోపలి పేజీల్లో...


- అమెరికా సామ్రాజ్యవాదం - ఇరాక్‌లో పరిణామాలు
- గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించండి
- విద్యార్థుల చదువులతో చెలగాటమాడుతున్న దోపిడీ పాలకవర్గాలు
- ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత సదస్సు
- పోరాడి విజయం సాధించిన నారాయణి స్టీల్ కార్మికులు


## రైతాంగ రుణాలమాఫీ - పాలకుల నాటకాలు

**16వ** లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, తెలంగాణాలో టిఆర్‌ఎస్‌లు రైతాంగరుణాలను మాఫీచేస్తామని వాగ్దానం చేశాయి. టిడిపి నాయకుడు చంద్రబాబునాయుడు అయితే అంతకుముందు ఉమ్మడి రాష్ట్రంలో పాదయాత్రచేస్తూ తన పార్టీ అధికారంలోకి వస్తే రైతాంగ రుణాలను మాఫీ చేస్తానని చెప్పాడు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావటం ఖాయమని, రుణాలు రద్దు చేస్తారు గనుక ఎవరూ బ్యాంకు రుణాలు చెల్లించవద్దని టిడిపి శ్రేణులు ప్రచారం చేశాయి.

అధికారంలోకి రావటంతో తెలంగాణాలో టిఆర్‌ఎస్ నేత కేసిఆర్ లక్ష రూ॥ల వరకూ రైతాంగ రుణాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించాడు. కానీ అందుకు తగిన చర్యలేవీ చేపట్టలేదు.

ఇటు ఆంధ్రప్రదేశ్‌లో తొలి సంతకం రైతాంగ రుణాల మాఫీపైనేనంటూ, దానినమలుపరిచే సూచనలు చెయ్యమంటూ కోటయ్య కమిటీని నియమించే జీఓపై సంతకం చేశాడు. గత రెండు నెలలుగా రుణమాఫీపై రెండు ప్రభుత్వాలు సాగిస్తున్న ప్రచారమూ, ఆడుతున్న నాటకమూ పాలకవర్గ పార్టీల మోసపూరిత స్వభావాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

వాగ్దానం చేశాయి కనుక రైతాంగ రుణాలను మాఫీ చేయటం అధికారంలోకి వచ్చిన టిడిపి, టిఆర్‌ఎస్ పార్టీల రాజకీయ బాధ్యత. దీనిని నెరవేర్చాలంటే, రైతు రుణాలను వారి ప్రభుత్వాలు బ్యాంకులకు చెల్లించాల్సి వుంటుంది. తిరిగి చెల్లింపులను ఆయా ప్రభుత్వాలు ఎలా చేస్తాయో చెప్పి బ్యాంకులను ఒప్పించితే రైతాంగానికి కొత్త రుణాలను బ్యాంకులిస్తాయి. తాము ఎలా తిరిగి చెల్లిస్తామో చెప్పకుండా, రైతురుణాల వసూలును వాయిదా వెయ్యమని రిజర్వుబ్యాంకును కోరాయి. ఆవిధంగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ రైతాంగ రుణాల మాఫీని, తిరిగి చెల్లింపును వాయిదా వేయటానికి కుదించాయి.

రైతాంగ రుణాలు వాయిదా వెయ్యాలంటే రిజర్వు బ్యాంకుకున్న మార్గదర్శకాలేమిటో అందరికీ తెలిసినదే. కరువు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు బ్యాంకులు రైతుల పంటరుణాల వసూలును వాయిదా వేస్తాయి. దీనికనుగుణంగానే రిజర్వు బ్యాంకు (గవర్నరు) కరువు వరదలకు గురైనట్లు ప్రభుత్వం ప్రకటించిన మండలాల్లో ఒక ఏడాది మారటోరియం, మూడేళ్లు రీషెడ్యూలు చేస్తానని చెప్పింది. బంగారం కుదువబెట్టి తీసుకున్న రుణాలు పంటరుణాల క్రిందకురావు గనుక రీషెడ్యూలు చెయ్యనని చెప్పింది. రాష్ట్రమంతటా రుణాలు రీషెడ్యూలు చెయ్యాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు తిరిగి చెల్లింపు పథకంతో తన వద్దకు వస్తే పరిశీలిస్తానని చెప్పింది. అంటే రాష్ట్రంలో రైతురుణాల మాఫీకి రాష్ట్ర ప్రభుత్వాలు తామెలా తిరిగి చెల్లిస్తాయో చెప్పమని కోరింది. రాష్ట్రంలోని రైతాంగ రుణాలన్నింటినీ రీషెడ్యూలు చెయ్యటం సాధ్యంకాదని చెప్పింది.

తాము చేసిన వాగ్దానాన్ని అమలుచెయ్యదలుచుకుంటే రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకులకు తిరిగి చెల్లింపులు ఎలా చేస్తామో నిర్దిష్ట ప్రణాళికను అందచేయాలి. అది చెయ్యకుండా కరువు, వరదలకు మా రైతాంగం నష్టపోవటం రిజర్వు బ్యాంకు గవర్నరుకు కన్పించలేదా అని వాదించటం వెనుక పెద్ద మోసం వుంది. రైతాంగం కరువు, వరదల వల్లనే నష్టపోయి అప్పుల పాలయినట్లు టిడిపి ప్రభుత్వం వాదించటమే అసలు వాస్తవాన్ని దాచిపెట్టే మోసం. సాగుకు అవసరమైన ఉత్పాదకాల రేట్లు అన్ని (ఎరువులు, సాగునీరు, విత్తనాలు, డీజిలు, పురుగుమందులు) పెంచివేసినందునా, పంట అమ్ముకోబోతే ప్రభుత్వ సంస్థలేవీ రంగంలో లేకుండా చేసినందునా, కనీస మద్దతు ధర కూడా లభించకా రైతాంగం అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వాలనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల ఫలితంగానే రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దిక్కుతోచక ఆత్మహత్యల పాలవుతున్నారు. దేశవ్యాపితంగా గత 20 ఏళ్లలో సాగిన రెండున్నర లక్షలమంది పేద రైతాంగం ఆత్మహత్యలకు మూలకారణమిదే.

తామనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాలలో మార్పు తీసుకురాకుండా, రుణమాఫీ వంటి తాత్కాలిక ఉపశమన చర్యలకే పరిమితం కావటం రైతాంగంలో పెరుగుతున్న అసంతృప్తిని చల్లార్చేందుకే.

పదేళ్లుగా యుపిఏ ప్రభుత్వం బడా బూర్జువాలకు ఏడాదికి 50 లక్షల కోట్ల రూ॥లు రాయితీగా యిచ్చింది. యుపిఏ ప్రభుత్వం తన మొదటి బడ్జెట్టులో ఈ రాయితీలను మరో లక్ష కోట్లు పెంచింది. కాగా రైతాంగానికిస్తున్న ఎరువుల సబ్సిడీ 60 వేల కోట్లు మాత్రం మోయలేని భారమౌతున్నదని తగ్గించుకునే ప్రయత్నాలకు పూనుకుంది. ఒక లక్ష కోట్లు వరకూ రైతాంగ రుణాల మాఫీచేస్తే (రాష్ట్ర ప్రభుత్వాలు తిరిగి చెల్లించినా) బ్యాంకింగు వ్యవస్థ తల్లక్రిందులౌతుందని గగ్గోలు పెడుతున్నాయి గానీ, బడా బూర్జువాలకు చెందిన 30 కుటుంబాలు బ్యాంకులకు ఎగ్గొట్టిన రుణాలే బ్యాంకుల మెడకు బండరాయిగా ఉన్నాయన్న (చిదంబరం ప్రకటన) వాస్తవాన్ని గురించి పన్నెత్తి మాట్లాడవు.

టిడిపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలనే కొనసాగించబూనుకుందనీ, అది దాచి పెట్టడానికే రైతాంగం అప్పులపాలవటానికి ప్రకృతి వైపరీత్యాలే కారణమని వాదిస్తున్నదని స్పష్టమౌతున్నది.

ఇక్కడ బ్యాంకులు చేస్తున్న మోసాన్ని కూడా పరిశీలించాలి. రైతాంగం సాగు అవసరాలకు కావలసిన ధనం 100 రూ॥లు అనుకుంటే అందులో 25 నుండి 30 రూ॥ల వరకూ మాత్రమే బ్యాంకులు రైతాంగానికిస్తున్నాయి. మిగిలిన 70 రూ॥లు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుండే రైతులు పొందుతున్నారు. ఆ 30 రూ॥లు కూడా లెక్కల్లో చూపించేదే. రైతాంగానికి పంటరుణాలతోపాటు బంగారం తాకట్టు పెట్టుకుని పంట రుణం యిస్తున్నారు. ఇవి పంటరుణాలు కాదని రిజర్వుబ్యాంకు అంటున్నది. కనుక రీషెడ్యూలు క్రిందకు రావంటున్నది. అంటే రైతాంగానికి రుణమిచ్చామని చెప్పుకోవటానికి అవి పంటరుణాలౌతాయి. రీషెడ్యూలు చేయాల్సి వచ్చేసరికి బంగారం తాకట్టు రుణాలౌతాయి. అంటే బ్యాంకులు కూడా ప్రభుత్వం చెప్పిన లక్ష్యాలు సాధించామని చూపడానికి బంగారు రుణాలను పంటరుణాలుగా చూపుతున్నాయి. వాస్తవంగా యిస్తున్న పంటరుణాలు 15 శాతం మించదు.

టిడిపి ప్రభుత్వం రుణమాఫీని ప్రకటించింది. కుటుంబంలో ఒక్కరికే అని చెప్పి, తర్వాత కుటుంబంలో ఎంతమంది బ్యాంక్ రుణాలు తీసుకున్నా మొత్తం మీద లక్షన్నర రుణమాఫీ జరుగుతుందని, బంగారం మీద తీసుకొన్న రుణం కూడా ఈ రుణమాఫీలోనే ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశాడు. డ్వాక్రా సంఘాలకు లక్ష రూపాయలమేర రుణమాఫీ చేస్తానని కూడా ప్రకటించాడు. ఈ మాఫీ కూడా వెంటనే సాధ్యంకాదని, అందుకు సమయం పడుతుందని చావు కబురు చల్లగా చెప్పాడు. రైతుల రుణాలను రీ షెడ్యూల్డ్ చేయించి, బ్యాంక్‌ల నుండి పంటరుణాలు యిప్పిస్తానని, అందుకు రిజర్వు బ్యాంక్‌ని ఒప్పిస్తానని, రుణమాఫీకి హామీగా ఎర్రచందనం నిల్వలను వేలం ద్వారా, ఇసుక సీనరేజ్ ద్వారా వచ్చే మొత్తాన్ని బాండ్ల రూపంలో అందచేస్తానని ప్రకటించాడు. వీటి ద్వారా వచ్చే ఆదాయం చాలా తక్కువన్న వాస్తవం తెలిసి కూడా వాటిని రుణమాఫీ ఆదాయవనరులుగా చూడటం, ఆచరణలో మొండిచేయి చూపటమే.

2013-14 వ్యవసాయ సీజన్ రుణాలకే రుణమాఫీ వర్తింపచేయటంవలన అప్పులఊబిలో ఉన్న చిన్న, సన్నకారు రైతులు రుణమాఫీ పరిధిలోకి రాకుండా పోయారు. అప్పుల భారంతో బ్యాంక్ అప్పుతీర్చలేక 2013-14 సీజన్‌లో చాలామంది రైతులు బ్యాంక్‌లనుండి తిరిగి రుణాలు పొందలేకపోయారు. వీరికి రుణమాఫీ వర్తించకపోవటంతో వారికి ఎటువంటి ఉపశమనం లభించని పరిస్థితి ఏర్పడింది. సేద్యానికి అవసరమైన పెట్టుబడి సమస్యగా మారింది. వడ్డీవ్యాపారులను ఆశ్రయించాల్సిరావటంతో మరింతగా అప్పులఊబిలో కూరుకుపోయే పరిస్థితికి నెట్టబడుతున్నారు. ఇలాంటివారికి రుణమాఫీ తప్పనిసరిగా అమలుజరపాల్సి ఉంది.

**(తరువాయి 2వ పేజీలో)**

## సిపిఐ(ఎం-ఎల్) 16వ లోక్‌సభ ఎన్నికల సమీక్ష

## మన కర్తవ్యాలు

**ఇటీవల** ముగిసిన 16వ లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఏ ఘోరపరాజయం చవిచూడగా, బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ, బిజెపి తనకు తానుగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల ఆధిక్యంతో విజయం సాధించింది.

ప్రజల జీవితాలతో, జీవనాధారాలతో చెలగాటమాడుతున్న రోజురోజుకీ పెరుగుతోన్న ధరలు, ద్రవ్యోల్బణం, వరుస కుంభకోణాలలో భారీస్థాయి అవినీతి వంటి వాటి పట్ల ప్రజల ఆగ్రహాన్ని ఈ ఫలితాలు వెల్లడిచేస్తున్నాయి. సామ్రాజ్యవాద బహుళజాతి పరిశ్రమలకు, దళారీ బడా బూర్జువా వర్గానికీ బడా భూస్వాములకు పాలకవర్గాలకు చెందిన బడా కాంట్రాక్టర్లకు, దళారులకు ప్రయోజనం చేకూర్చే, దేశానికీ, దేశ ప్రజలకూ వినాశనం చేకూర్చే కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఏ అనుసరించిన విధానాలపట్ల ప్రజల ఆవేశం, ఆగ్రహాలను ఈ ఫలితాలు వెల్లడిచేస్తున్నాయి. ఇంతేకాక, దశాబ్దాలుగా ప్రజలు తాము అనుభవిస్తున్న దుర్భర జీవన, పని పరిస్థితులు మెరుగుకావాలనే బలమైన ఆకాంక్షను ఈ ఎన్నికల ఫలితాలు తెలియబరుస్తున్నాయి.

ఎన్నికలకు చాలా ముందుగానే, ఆర్‌ఎస్‌ఎస్ - తన రాజకీయ విభాగమైన బిజెపి ద్వారా ప్రజల మానసిక స్థితి గుర్తించి, తమకనుకూలంగా పరిస్థితులను మలచుకునేందుకు తమకున్న సర్వశక్తులను రంగంలోకి దించింది. అది చాలావేగంగా పరిస్థితులనందుకొని, ఎన్నికల ఫలితాలను తనకనుకూలంగా రాబట్టుకుంది. ఈ ఎన్నికలలో భారీ విజయం సాధించేందుకు ప్రజలను ప్రక్కదోవ పట్టించడంలో, బోల్తాకొట్టించటంలో వారు విజయం సాధించారు. 2013 సెప్టెంబరులోనే తొలుత ఎన్నికల ప్రచార కమిటీ అధ్యక్షునిగా, తర్వాత ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్రమోడిని ప్రకటించాలని బిజెపి నాయకత్వంపై ఆర్‌ఎస్‌ఎస్ వత్తిడి తీసుకువచ్చింది. భవిష్య ప్రధాని అభ్యర్థిని ముందుగా ప్రకటించి ఎన్నికలలోకి దిగటం ఇదే మొదటిసారి. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్‌కు చెందిన నెహ్రూ కుటుంబ పాలన పట్ల మోడీ మరియు అతని ప్రచారకులు వేలెత్తి చూపుతూ ఆర్భాటం చేశారు. కానీ, వాస్తవానికి వ్యక్తి పూజా విధానాన్ని పెంచి పోషించటంలోనూ, అనుసరించటంలోనూ వారు కాంగ్రెస్‌కు ఏమాత్రం తీసిపోలేదు.

నెలలకు ముందుగానే ప్రసారమాధ్యమాలను కొనివేశారు. ఏదో కొద్దిపాటి మినహాయింపులు తప్ప, ప్రసార మాధ్యమాలన్నీ, మోడీ ప్రచార సాధనాలుగా తోడ్పడ్డాయి. గత పార్లమెంటు ఎన్నికలలో ఎప్పుడూ ఎవరికీ లభించని ప్రచారాన్ని మోడీకి ఇచ్చాయి.

భారత బడా బూర్జువా వర్గం, బడా కార్పొరేటు యజమానులు మోడీని భవిష్యత్తు ప్రధానిగా ముందుకు తెచ్చారు. దీనికి అమెరికా ఆమోదం కూడా ఉంది. 'అభివృద్ధి, ప్రగతి' నినాదాల మాటున ఉదారవాద ఆర్థిక సంస్కరణలను దూకుడుగా, తాము కోరుకున్న తీవ్రతతో సాహసోపేతంగా అమలుజరిపి తమ ప్రయోజనాలను కాపాడగలడని వారు విశ్వసించారు. గుజరాతు రాష్ట్రంలో, మోడీ పాలనలో పరిశ్రమల స్థాపనకోసం ప్రజల జీవితాలను బలిపెట్టి, వేలాది ఎకరాల భూములను కారుచౌకగా అప్పగించటమేకాక, పెద్దమొత్తంలో పన్నురాయితీలు వంటి అనేక సౌకర్యాలను కార్పొరేటు పరిశ్రమలకు, బహుళజాతి పరిశ్రమలకు కల్పించటాన్ని బడా బూర్జువావర్గం పేర్కొంది. కార్పొరేటు పరిశ్రమలతోసహా భారత బడా బూర్జువావర్గం బిజెపి ఎన్నికల ప్రచారనిధికి భారీ విరాళాలు అందచేశాయి. బిజెపి తన ఎన్నికల ప్రచారానికి కనీసం పదివేల కోట్ల రూ॥లు ఖర్చుచేసి వుంటుందని భావిస్తున్నారు. 'దేశంలో సత్వర అభివృద్ధి', 'సామాన్య ప్రజల సమగ్ర అభివృద్ధి మరియు మెరుగైన భవిష్యత్తు' అనేవి బిజెపి మరియు మోడీల ఎన్నికల వాగ్దానాలుగా వున్నాయి. అభివృద్ధికి ఓ చిహ్నంగా, నిర్ణయాత్మకంగా వ్యవహరించగల శక్తివంతుడిగా మోడీని ముందుకు తెచ్చారు. దీనికి తోడుగా, హిందూత్వ ఎజెండా, ఓబిసిల కుటుంబంలో మోడీ జన్మించాడని, చాయ్‌వాలాగా అతని బాల్యం గురించిన గాథలు ప్రచారంలో పెట్టటం ద్వారా ఓట్లను రాబట్టుకునేందుకు ఉపయోగించారు. దీనితోపాటుగా బీహార్ రాష్ట్రంలో పాశ్వాన్‌కు చెందిన లోక్‌జనశక్తి పార్టీతో, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీతో పాటుగా వివిధ రాష్ట్రాలలో ఏర్పరచుకున్న పొత్తులు ఆయా రాష్ట్రాలలో అధికారస్థానాన్ని అందుకోవటానికి తోడ్పడ్డాయి.

లెఫ్ట్‌ఫ్రంట్ మరియు ఉత్తరప్రదేశ్‌లో ములాయం నాయకత్వంలోని యస్.పి, బీహార్‌లో నితీష్ నాయకత్వంలోని జె.డి.యు తదితర పార్టీలతో కూడిన బలహీన వేదిక అయిన మూడవ కూటమి 'పార్టీల యునైటెడ్ ఫ్రంట్'గా ఎన్నికల రంగంలోకే దిగలేక ప్రారంభంలోనే చేతులెత్తేసింది. నవీన్ పట్నాయక్, జయలలిత మూడవ ఫ్రంటు నుండి దూరంగా జరిగారు. మమత ఈ కూటమి పట్ల చాలా వ్యతిరరేకతతో వుంది. ఫలితంగా ఈ మూడవ కూటమి అనబడేది ఎన్నికలలో ఘోరంగా విఫలమైందిగా రుజువుచేసుకుంది. ఈ సందర్భంలో, 16వ లోక్‌సభ ఎన్నికలు సిపిఐ(ఎం) యొక్క నిజరూపాన్ని ప్రత్యేకించి వారి బలమైన నిర్మాణ కేంద్రంగా పేర్కొంటున్న బెంగాల్‌లో వెల్లడిచేశాయి. వారికి గల కష్టజీవుల పునాది మద్దతు బిజెపి వైపు మొగ్గుచూపిందని ఓటింగ్ సరళి తెలుపుతోంది. ఎన్నికల తదనంతరమూ ఈ ధోరణి కొనసాగింది. దేశంలోని ప్రజాస్వామిక, లౌకిక శక్తులను ఈ పరిణామాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యపు డొల్లతనాన్ని మరోసారి నగ్నంగా వెల్లడిచేశాయి. "మొత్తంగా ఈ ఎన్నికల ప్రక్రియ వ్యవస్థ అంతా ప్రజాస్వామ్య సూత్రాలను అపహాస్యం చేసేదిగా మార్చబడింది. డబ్బు, కండబలం, మతతత్వ, కులతత్వ, ప్రాంతీయతత్వ ధోరణులే ఓటింగ్ సరళిని, ఫలితాలనూ నిర్ణయించటంలో కీలకమైన పాత్ర నిర్వహిస్తున్నాయి. సాధారణ ప్రజానీకానికి వారి నిజమైన ప్రతినిధులను పార్లమెంటరీ వ్యవస్థలకు పంపే అవకాశం లేకుండా ద్వారాలు మూసివేయబడ్డాయి" అని మనం అంచనావేసిన విధంగానే జరిగింది.

మతతత్వ సమస్యపై మోడీ తన స్థానాన్ని కొంతమేరకు మార్చుకున్నాడని కొందరు మేధావులు పేర్కొంటూ మన దేశ ప్రజలను ఈవిధంగా నమ్మమని కోరినప్పటికీ ఎన్నికల ప్రచార సందర్భంగా అతని నినాదాలు, వారి మంత్రుల, ఇతర బిజెపి నేతల ప్రకటనలు దీనిని అబద్ధమని తేల్చాయి.

**(తరువాయి 2వ పేజీలో)**

## సిపిఐ(ఎం-ఎల్)... (మొదటిపేజీ తరువాయి)

మోడీ తనకు తాను అభివృద్ధికి చిహ్నంగా పేర్కొంటూ వస్తున్నప్పటికీ, అతని హిందూత్వ అజెండా అతని నీడను అంటుకునే ఎల్లవేళలా వుంటూవుంది. బంగ్లాదేశ్ నుండి శరణార్ధులుగా చెప్పబడుతున్న వారినీ, గోమాంసం ఎగుమతితో లబ్ధిపొందుతున్నవారిని వెనకకు పంపివేస్తాననీ; రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని రద్దుచేస్తానని మోడీ చేసే ప్రకటనలు అతనిలో మార్పేమీ లేదనటానికి రుజువులు. ఎన్నికల ఫలితాలలో బిజెపి పార్లమెంటుసభ్యులు 283 మందిలో ఒక్కరంటే ఒక్కరు కూడా ముస్లిము మతస్థులు లేరు. కనుక హిందూత్వ శక్తులు తమ దుష్టస్వరూపాన్ని తిరిగి బయటపెట్టుకుంటాయని చింతించేందుకు సరైన కారణమే వుంది. రామమందిరం, 370వ అధికరణం, ఏకీకృత పౌరస్మృతి, చరిత్రలో మార్పులు, పాఠ్యపుస్తకాల లోని సాంస్కృతిక అంశాలలో మార్పులు వంటివాటిని అమలుచేయాల్సిందిగా ఆర్ఎస్ఎస్ నాయకులు ఇప్పటికే నూతన ప్రభుత్వాన్ని వత్తిడి చేస్తున్నారు.

తమిళనాడు, ఒడిషా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలలో వివిధ కారణాలతో ప్రాంతీయ పాలకవర్గ పార్టీలు ప్రజలలో మెరుగైన పట్టును కలిగివుండి, మోడీ ప్రభంజనమని చెప్పబడేది ప్రభావమేమీ చూపలేక పోయింది. ఈ రాష్ట్రాలలో ఏఐఏడిఎమ్‌కె, బిజెడి, తృణముల్ కాంగ్రెస్ పార్టీలు దేశవ్యాపితంగా వీచిన కాంగ్రెస్ వ్యతిరేకతను ఉపయోగించుకొని అత్యధిక స్థానాలు గెలుపొందాయి. ఉత్తరప్రదేశ్‌లో యస్‌పి, బీహార్‌లో జెడియులు ఆయా రాష్ట్రాలలో ప్రజల మద్దతును కలిగివుండకపోవటంతో కాంగ్రెస్ వ్యతిరేకత నుండి లబ్ధి పొందలేకపోయాయి.

తమ వాగ్దానాలు, ప్రజాకర్షక నినాదాలతో మోడీ మరియు బిజెపి ప్రజలలో అధికమైన ఆశలు కల్పించారు. మోడీ అధికారంలోకి వస్తే ధరల పెరుగుదల, అవినీతి, పెద్ద మొత్తంలో నల్లధనం వెలికితీత, నిరుద్యోగం, మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు వంటి ఇతర అనేక సామాజిక, ఆర్ధిక, రాజకీయ సమస్యలపై దృష్టిసారించి వాటిని అరికడతానని ప్రజల్ని భ్రమల్లో ముంచెత్తారు. కానీ, ప్రభుత్వ విధాన ప్రకటనలు, కేంద్ర ప్రభుత్వ మొదటి బడ్జెట్టు గమనిస్తే–నిరాటంకంగా, మొరటుగా గత దశాబ్ద కాలంగా మన్‌మోహన్‌సింగ్ అమలుచేసుకుంటూ వస్తున్న విధానాల కొనసాగింపుకే మోడీ ప్రభుత్వం కట్టుబడి వుందని సూచిస్తున్నాయి. రైలు ప్రయాణీకుల ఛార్జీల, సరుకు రవాణా ఛార్జీలను భారీగా పెంచటమే మొదటి సూచికగావుంది. భారీస్థాయిలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వరంగబ్యాంకులను ప్రైవేటీకరించటం; రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్షపెట్టుబడులను పెంపు చేయటం, రైల్వేలలో ఎఫ్‌డిఐలను ప్రవేశపెట్టడం మొదలగు చర్యలతోపాటుగా ఆహారం, చమురు, ఎరువుల సబ్సిడీలను ఘోరంగా తగ్గించటం వంటివి మచ్చుకు కొన్ని చర్యలు మాత్రమే.

సామ్రాజ్యవాదులు మనదేశంలో అమలుచేస్తున్న ఆర్థిక సంస్కరణలు, దేశ ప్రజల జీవితాలలో వినాశనం సృష్టించాయి. అది వ్యవసాయ రంగంలో వత్తిడులు కానీ, ఉత్పత్తి రంగంలో తరుగుదలకానీ, సేవారంగంలో కదలబారిన పరిస్థితిగానీ, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, ప్రాజెక్టులు, రహదార్లు, సెజ్‌లు లేక విద్యుదుత్పత్తి కేంద్రాలు, రైల్వే కారిడార్లు మొదలైనవాటి భారాలన్నింటినీ కార్మికులు, రైతులు, యువజనులు, మహిళలు మరియు సాధారణ ప్రజానీకపు వీపులపై మోపి వారి జీవితాలను, జీవనాధారాలను సర్వనాశనం గావించాయి. అనేక ప్రాంతాలలో ప్రజలు ఈ చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతిఘటనలు రానున్న కాలంలో మరింత బలాన్ని సమకూర్చుకుని మరింత విస్తరించటం తధ్యం. పాలకవర్గాలు ఈ ప్రజా ఉద్యమాలను తమ ఉక్కుపాదంతో అణచివేయాలని, అభివృద్ధి భ్రమలలో ముంచెత్తి ప్రక్కదోవ పట్టించాలని భావిస్తున్నాయి. దోపిడీ వర్గాలు తమ లక్ష్యాలను సాధించుకునేందుకు అడ్డుగా నిలిచిన ప్రజలను, వారి ప్రతిఘటనలను శక్తివంతంగా అణచివేసేందుకే మోడీని అధికారంలోకి తీసుకువచ్చాయి. వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదాలకు వ్యతిరేకంగా పోరాడటం, దేశ భద్రతను కాపాడుకోవటమనే పేరిట ఈ చర్యలను సమర్ధించుకో జూస్తున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల నుండి మనకందుతున్న నిఖార్సైన సందేశమిదే.

అమెరికా అధ్యక్ష ఎన్నికల తరహాలో ఈ ఎన్నికలు నిర్వహింపబడబోతున్నాయని, అధ్యక్షుడే శక్తివంతుడుగా (మనదేశంలో ప్రధాని) వుండే అధ్యక్షతరహా పాలన రానున్నదని) మన పార్టీ సరిగ్గానే అంచనా వేసింది.

బిజెపి – సంఘ్ పరివార్‌ల కూటమి ఎన్‌డిఏ ముసుగులో అధికారంలోకి రానుందని, దేశంలోని లౌకిక ప్రజాతంత్ర శక్తులన్నింటిపై అన్నివైపుల నుండి దాడులు సాగనున్నాయని, భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చే ఉద్దేశంతో ప్రజలను మతప్రాతిపదికపై విభజించి, సామ్రాజ్యవాదుల, బడాబూర్జువాల ప్రయోజనాలు నెరవేర్చనున్నాయని మనం సరిగానే అంచనావేశాం. ఎన్‌డిఏ కూటమి అధికారంలోకి రావటమంటే ప్రజల హక్కులు ఫాశిస్టు తరహాలో అణచి వేయబడతాయని, బడాపెట్టుబడిదారీ వర్గప్రయోజనాలు పరిరక్షింపబడతాయని మనం సరైన అంచనానే ప్రకటించాం.

బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ, కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఏ మరియు దేశంలోని వివిధ ప్రాంతీయ పాలకవర్గ పార్టీలన్నీ విభజనవాద, సంకుచిత నినాదాలతో, ప్రచారాలతో ప్రజలను కుల, మత, ప్రాంతీయ తదితర ప్రాతిపదికలపై విభజనకు గురి చేయటం ద్వారా, వారి వాస్తవ సమస్యల నుండి ప్రక్కదారి పట్టించి తమ తమ ఎన్నికల ప్రయోజనాల కనుగుణమైన ఓటు బ్యాంకులుగా తయారుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితి కమ్యూనిస్టు విప్లవకారుల భుజస్కంధాల మీద ఓ అదనపు, గురుతర బాధ్యతను మోపుతున్నది. పాలకుల, పాలకవర్గాల విభజన వాదాలకు, ప్రక్కదారి పట్టించే విధానాలకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటాలు నిర్వహించాల్సి వుంది. రానున్నకాలంలో పాలకవర్గాలు, ప్రభుత్వాలు సాగించే హక్కుల కాలరాచివేతకు వ్యతిరేకంగా ప్రజలు తమ హక్కులకై జరిపే పోరాటంలో వారినందరినీ ఐక్యంచేసి నిలబెట్టాల్సి వుంది.

సంక్షోభభరిత ఆర్ధికవ్యవస్థను మోడీ ప్రభుత్వం వారసత్వంగా పొందింది. ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్ధికవ్యవస్థలో భాగంగా అనివార్యంగా సంభవించే సంక్షోభంలో ఇది ఓ భాగం. మనదేశం సామ్రాజ్యవాద బంధనాల నుండి విడివడనంతదాకా మన దేశ, ప్రజల ప్రయోజనాలకనుగుణంగా మౌలికంగా, నిర్ణయాత్మకంగా లక్ష్య నిర్దేశన జరగనంత వరకూ ఈ సంక్షోభాన్ని అధిగమించటం సాధ్యంకాదు.

ఇప్పటిదాకా కొనసాగిన, మార్గనిర్దేశం చేయబడిన అవే విధానాలను అమలుచేయటంలో మోడీ ప్రభుత్వం వేగంగా, ఎంత నిర్ణయాత్మకంగా వ్యవహరించినా, అది పరిస్థితిని మెరుగ్గా మార్చటానికి బదులుగా మరింత క్షీణింపచేస్తుంది. అదేవిధంగా మోడీ ప్రభుత్వం తన డొల్లవాగ్దానాలతో, పదాడంబర, ప్రాచుర్యం పొందిన నినాదాలతో ప్రజలకేమాత్రం ఓదార్పునీయలేదు; లేదా వారి హిందూత్వ ఎజెండాతో, కులతత్వ, మతతత్వ, ఛాందసవాదనినాదాలతో ప్రజలను ఎల్లకాలం ప్రక్కదోవ పట్టించడం సాధ్యమూ కాబోదు. జీవితవాస్తవాలు చాలా శక్తివంతమైనవి. ప్రజలు తమ అనుభవాల నుండి గ్రహించి, వారి పోరాటమార్గంలోని అన్ని అడ్డంకులను అధిగమించగలుగుతారు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను సిపిఐ(ఎం) వారి లెఫ్ట్ ఫ్రంట్ భాగస్వామ్య పక్షాలతోసహా పార్లమెంటరీ విపక్ష పార్టీలన్నీ, గతించిపోయిన, మార్చుజాలని అంశంగా ఆమోదించి, వారు అధికారంలో వున్న రాష్ట్రాలలో ఆ విధానాలను అమలు చేస్తుండగా, మన దేశము మరియు మన దేశ ప్రజానీకం భవిష్యత్తులో తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొనబోతున్నారు. కమ్యూనిస్టు విప్లవశక్తులు ముందుకు వచ్చి ఈ సవాళ్ళను స్వీకరించాలి. ఇప్పటివరకు తాము నిర్వహించిన పాత్రపై వారంతా తప్పక స్వీయపరిశీలన చేసుకోవాలి. ఈక్రమంలో వారు తమ శక్తిని పుంజుకుని సూత్రబద్ధంగా తమలో తాము ఫలవంతమైన ఐక్యతను సాధించేందుకు నిజాయితీగా కృషిచేయాలి. వారు ప్రజాసంఘాలపరంగా, ఉద్యమాల పరంగా బలం పుంజుకోవాలి. రానున్న కాలంలో ప్రమాదాల నెదుర్కొనేందుకు ప్రజాతంత్ర, దేశభక్తియుత శక్తులతో చెలిమిని, కూటమిని ఏర్పరచటానికి వీరు కృషి సాగించాలి. ఈ క్రింది డిమాండ్లపై ప్రజలను సమీకరించి, సంఘటిత ఉద్యమాలు నిర్మించాలి.

- V సామ్రాజ్యవాద ప్రపంచీకరణను, ప్రైవేటీకరణను, సరళీకరణను వ్యతిరేకించండి.
- V ఆహారభద్రతా చట్టంలో మార్పులు చేయబోవటాన్ని ఆపివేయాలి.
- V ఉపాధిహామీ పథకంలో మార్పులు చేయరాదు.
- V భూసేకరణ చట్టంలో మార్పులను ఆపివేయాలి.
- V ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలి.
- V రక్షణ ఉత్పత్తుల ప్రైవేటీకరణను ఆపివేయాలి.
- V అధిక ధరలనరికట్టాలి.
- V దేశంలో కరువు పరిస్థితిని ప్రకటించి, రైతాంగానికి సహాయమందించాలి.
- V ప్రజానుకూల అభివృద్ధి విధానాన్ని అమలు చేయాలి.

**సిపిఐ(ఎం-ఎల్), కేంద్రకమిటి**

## రైతాంగ రుణాల మాఫీ... (మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం మాత్రం అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకోకపోవటం వలన వారికి రుణమాఫీ నిరుపయోగంగా మారింది.

**కౌలురైతులకు వర్తించని రుణమాఫీ :** రుణమాఫీ అర్హతకు కౌలురైతులు మొదటివారుగా ఉంటారు. సేద్యపు ఖర్చులకు అదనంగా వీరు కౌలు భూమికి కూడా డబ్బులు చెల్లించాలి. ఫలితంగా పెట్టుబడి సమకూర్చుకోవటం కోసం అనేక అవస్థలు పడుతున్నారు. వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకుంటూ అప్పుల ఊబి నుండి బయటపడలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కౌలుదారీ చట్టాలు అమలుకాకపోవటం వలన ఎటువంటి హక్కులూ లేని పరిస్థితుల్లో వీరికి బ్యాంక్‌ల నుండి పంటరుణాలు అందటంలేదు. ఎటువంటి హామీ లేకుండా 50 వేల వరకు రుణం యిచ్చే అవకాశం ఉన్నా, కౌలురైతులకు దాన్ని వర్తింపచేయటంలేదు. రాష్ట్రంలో 30 లక్షలమందికి పైగా కౌలుదారులున్నారు. వీరందరూ బ్యాంక్ రుణాలకు దూరంగానే ఉన్నారు. వీరికి రుణమాఫీ వర్తింప చేయలేదు. కౌలురైతుల సంక్షోభాన్ని ఏమాత్రం పరిగణలోకి తీసుకొన్నా వీరి ప్రైవేటు అప్పులకు రుణమాఫీ వర్తింపచేసి, ప్రభుత్వమే చెల్లించేది. అలాంటి నిర్ణయం ప్రభుత్వం తీసుకోలేదు. దీన్ని గమనిస్తే కౌలురైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టలేదని అర్ధమౌతున్నది. ఫలితంగా కౌలురైతులు రుణమాఫీకి దూరంగా నెట్టబడ్డారు.

**విధివిధానాలు లేని రుణమాఫీ :** ఏ పథకాన్ని అమలుజరపాలన్నా అందుకు సంబంధించిన విధానాలను రూపొందించాలి. అప్పుడు మాత్రమే అమలుపై స్పష్టతవస్తుంది. రైతుల రుణమాఫీఅమలుకు ప్రభుత్వం ఎటువంటి విధానాలను ఇంతవరకు ప్రకటించలేదు. కుటుంబంలో ఎందరి పేర ఎన్ని బ్యాంకుల్లో అప్పులు ఉన్నా కుటుంబానికి వర్తించే రుణమాఫీ లక్షన్నర మాత్రమేనని ముఖ్యమంత్రి ప్రకటించాడు. కుటుంబం అంటే భార్య–భర్త, మైనర్ పిల్లలుగా కోటయ్య కమిటీ ప్రకటించింది. ఇది పూర్తి సరైన నిర్వచనం కాదు. చాలా కుటుంబాల్లో భార్య – భర్తతోపాటు పెండ్లి అయిన కొడుకులు వేరే కుటుంబంగా ఒకే ఇంట్లో జీవిస్తుంటారు. వీరు బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటారు. వీరిని వేరు కుటుంబాలుగా గుర్తించి వారికి సంబంధించి రుణమాఫీ చేస్తారా! వారిని కూడా ఒకే కుటుంబసభ్యులుగా పరిగణించి మాఫీకి అర్హతలేనివారిగా పరిగణిస్తారా!? ఇందుకు సంబంధించి రుణమాఫీలో ఎలాంటి వివరణ లేదు. వివిధ బ్యాంకుల్లో ఉన్న పంటరుణాలను అనుసంధానం చేసి రుణమాఫీ అమలు గురించి ప్రకటిస్తామని చంద్రబాబు చెబుతున్నాడు. బ్యాంక్‌లు అందుకు అంగీకరిస్తాయా? తమ బ్యాంక్ రుణానికే మాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం ఏమి చేస్తుంది? అన్ని బ్యాంక్‌లకు మాఫీ మొత్తాన్ని సర్దుబాటు చేస్తే ఏ బ్యాంక్‌లోనూ రైతు అప్పు రద్దుకాదు గదా!? రీషెడ్యూల్డ్ మండలాల్లో లక్షకు మించి ఉన్న మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తుందా!? వీటికి సంబంధించిన విధానాలేవీ ప్రభుత్వం ప్రకటించలేదు. విధి విధానాలు ప్రకటించకపోతే రుణమాఫీ అనేది గందరగోళంగా మారి అమలు అసాధ్యంగా మారుతుంది.

డ్వాక్రా మహిళా గ్రూపుల రుణమాఫీ పరిస్థితి రైతాంగం పరిస్థితిలాగానే ఉంది. రాష్ట్రంలో 7.6 లక్షల డ్వాక్రా మహిళా సంఘాల్లో 89 లక్షలమంది సభ్యులుగా ఉన్నారు. వీరు 14,204 కోట్లరూపాయలు బ్యాంక్‌లకు బకాయిపడ్డారు. వీరిలో 2.94 లక్షల సంఘాలు లక్షలోపు రుణాలు తీసుకొన్నట్లు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నివేదిక వెల్లడిస్తున్నది. మిగతా 4.66 లక్షల సంఘాలు సంపూర్ణ ఆర్ధిక చేకూర్పు (టిఎఫ్ఐ) కింద రెండు లక్షల నుంచి ఐదు లక్షల వరకు రుణాలు తీసుకొన్నట్లు నివేదిక తెలియచేసింది. డ్వాక్రా సంఘాల రుణ వివరాలు గురించి గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్) ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. లక్షలోపు తీసుకొన్న మహిళా సంఘాలు చాలా వరకు తిరిగి రుణాలు చెల్లించాయి. ఒక్కో సంఘం 10 నుండి 15 వేలు మాత్రమే బకాయిలుపడ్డాయి. రెండు లక్షల కన్నా ఎక్కువ రుణాలు తీసుకొన్న సంఘాలు మాత్రమే అధికంగా బకాయిలు పడ్డాయి. ఈ వ్యత్యాసాన్ని గమనించిన చంద్రబాబు రుణమాఫీ భారం తగ్గించుకోవటానికి లక్షలోపు బాకీ ఉన్న సంఘాలకు మాత్రమే మాఫీని ప్రకటించి, లక్షపైగా రుణం తీసుకున్న సంఘాలకు ప్రోత్సాహకంగా లక్షరూపాయలు మూలధనం పెట్టుబడిగా యిస్తానని ప్రకటించారు. ఇందుకు సంబంధించి జివో(ఎంఎస్ నం.164) జారీ అయ్యింది. మొదట 7.6 లక్షల డ్వాక్రా మహిళా సంఘాలకు సంబంధించిన 7,600 కోట్లు మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు, లక్షలోపు బకాయి ఉన్న సంఘాలకు మాత్రమే మాఫీ వర్తిస్తుందని ప్రకటించి, రుణమాఫీ భారాన్ని 3,500 కోట్లకు తగ్గించుకొన్నాడు. ఒక్కో డ్వాక్రా సంఘంలో 10 నుండి 20 మంది దాకా సభ్యులు ఉంటారు. సంఘానికి రుణం మంజూరు చేసేటపుడు, సభ్యులు మూలధనంగా 40 వేల వరకు బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలి. అది బ్యాంక్‌లోనే ఉంటుంది. మూలధనం రూపంలో పెద్దమొత్తంలో డ్వాక్రా మహిళాసంఘాల డబ్బు బ్యాంకులు పొందుతాయి. రుణాల చెల్లింపుకోసం వాయిదా పద్ధతిలో చెల్లించే డబ్బులు కూడా ఎటువంటి వడ్డీ ఇవ్వకుండా యిచ్చిన రుణంలో చెల్లువేయకుండా బ్యాంక్‌లు ఉపయోగించుకొంటున్నాయి. లక్షపైగా బకాయిలుపడ్డ సంఘాలకు మూలధనం లక్ష రూపాయలు యిచ్చినా అది సంఘం బకాయి క్రింద జమపడదు. మూలధనంగా, సంఘాలకు యిచ్చిన రుణాలకు గ్యారంటీగా బ్యాంకుల్లో ఉంటుంది. ఇది బ్యాంక్‌లకే ప్రయోజనకరం. లక్షరూపాయలలోపు రద్దుచేసిన సంఘాల సభ్యులకు కూడా నామమాత్రంగానే రుణమాఫీ జరుగుతుంది.

**రైతు సేవింగ్ డిపాజిట్లను – డ్వాక్రా సంఘాల మూలధనాన్ని జమవేసుకొంటున్న బ్యాంక్‌లు**

రుణమాఫీ మొత్తానికి ప్రభుత్వం బాండ్లు ఇవ్వకపోవటం, రైతులు రుణాలు చెల్లించకపోవటంతో, తమ బకాయిలు రాబట్టుకొనేందుకు బ్యాంక్‌లు నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయి. ఖరీఫ్ కాలం గడిచిపోతున్నది. సాగుకోసం పెట్టుబడి కావాలి. బ్యాంక్‌లు ఇవ్వనంటున్నాయి. బయట అప్పు పుట్టే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జీవిత బీమా పాలసీలను సరెండర్ చేయగా వచ్చే చెక్కులను తమ పొదుపు ఖాతాలో జమచేసి చెక్కు తన ఖాతాలో జమపడిన తర్వాత సేద్యం కోసం తీసుకొందామని బ్యాంక్‌కి వెళితే రైతులకు బ్యాంక్‌లు షాక్ యిస్తున్నాయి. మీకు రుణబకాయి ఉన్నందున మీ పొదుపుఖాతాను స్థంభింప చేస్తున్నామని, బకాయి చెల్లించేవరకు మీరు సొమ్ము తీసుకోవటానికి వీలులేదని కరాఖండిగా చెబుతున్నారు.

పిల్లల చదువుకోసం, పెళ్ళిళ్ళ కోసం, వైద్యం కోసం, అనుకోకుండా వచ్చే అవసరాల కోసం పైసా, పైసా పొదుపు ఖాతాల్లో దాచుకొన్న డబ్బును కూడా తమ బకాయిల వసూలుకి జమవేసుకొనేందుకు ఆ డబ్బును కూడా స్థంభింపచేస్తున్నాయి. దీంతో రైతాంగం దిక్కుతోచని స్థితికి నెట్టబడుతున్నారు.

డ్వాక్రా మహిళా సంఘాల బకాయిలను కూడా బ్యాంక్‌లు నిరంకుశంగా రాబట్టుకొంటున్నాయి. వారి మూలధనం నుండి వాయిదాల చెల్లింపును జమచేసుకొంటున్నాయి. దీని ఫలితంగా రుణమంజూరు అయినప్పుడు తిరిగి మూలధనం చెల్లించాల్సిన పరిస్థితి డ్వాక్రా సంఘాలకు ఏర్పడి సభ్యులపై భారంపడుతుంది. ఈ బ్యాంక్‌లు రైతుల – డ్వాక్రా సంఘాల ఎడల నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయి.

**రైతాంగ సమస్యలు పట్టించుకోని పాలకులు :** అన్ని పాలకపార్టీలు రైతుల రుణమాఫీ చుట్టూనే తిరుగుతున్నాయి. ముంచుకొస్తున్న కరువు పరిస్థితి ఎవరికీ పట్టలేదు. రుణమాఫీ జరిగితే రైతుల సమస్యలన్నీ పరిష్కారమౌతాయనే భ్రమలు కల్పిస్తున్నారు. రుణమాఫీపై రాజకీయ ప్రయోజనం కోణంలో పాలక పార్టీలు విమర్శించుకొంటున్నాయి. రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోవటానికి గల మౌలిక సమస్యల పరిష్కారం గురించి ఏ పార్టీ నోరు మెదపటంలేదు. సేద్యపు ఖర్చులు పెరగటానికి కారణమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, డీజిల్ ధరల పెరుగుదల గురించి మాట్లాడటం లేదు. వాటి ధరలు తగ్గించి సేద్యపు ఖర్చులు తగ్గించి, పంటలకు న్యాయమైన ధరల కల్పన గురించి నోరు మెదపటంలేదు. అలా కల్పించి ఉంటే నేడు రైతాంగం అప్పుల ఊబిలో కూరుకు పోయేవారు కాదు. ప్రభుత్వాలు రుణమాఫీ చేయాల్సి ఉండదు. ఎవరి సహాయం కోసం రైతాంగం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. రైతాంగ ప్రయోజనాలు పట్టని పాలకుల విధానాలే నేటి రైతాంగ సంక్షోభానికి కారణంగా ఉన్నాయి.

**పూర్తి రుణమాఫీకి – న్యాయమైన ధర కోసం ఉద్యమిద్దాం :** నేటి పాలక ప్రభుత్వాలు తమ సమస్యలు పరిష్కరించవని రైతాంగం గుర్తించాలి. కౌలు రైతులతోసహా పూర్తిగా పంటరుణాలన్నీ రద్దుచేయాలని, సేద్య అవసరాల ఖర్చులు తగ్గించాలని, పండించిన పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించాలని, సాగునీరు అందించాలనీ, దళారుల దోపిడీని అరికట్టాలని రైతాంగం ఉద్యమించాలి. ✶

# సర్వసత్తాక, స్వతంత్ర, ప్రజాతంత్ర ఇరాక్‌కోసం సాగించే పోరాటం కష్టతరమే, అయినా అనివార్యం!

**ఇరాక్‌లో** పరిస్థితి గందరగోళంగా వుంది. ఐఎస్‌ఐఎస్ (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా) సాయుధ బృందాలు కొద్దిపాటి లేదా అసలేమాత్రమూ ఇరాక్ ప్రభుత్వ బలగాలనుండి ప్రతిఘటన లేకుండానే ఒక ప్రాంతం తర్వాత మరొక ప్రాంతాన్ని ఆక్రమించుకుంటున్నాయి. ప్రచారమాధ్యమాల కథనం ప్రకారం, 2014 జనవరి నాటికి ఐఎస్‌ఐఎస్ అంబర్ ప్రాంతంపై తన పట్టును నిలుపుకోగలిగింది. 2014 జూన్‌లో అది – సమర్రా, మోసుల్, మరి అనేక తూర్పు, పశ్చిమ ఇరాక్‌లోని పట్టణాలను, అలాగే ఇంకా ఇరాక్–సిరియా సరిహద్దులోని స్థావరాలన్నింటిని కైవసం చేసుకుంది. చివరగా జూన్ 29న ఐఎస్‌ఐఎస్–ఇరాక్, సిరియా భూభాగాలలో తన అదుపులో వుండే ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పరిచినట్లుగా ప్రకటించుకుంది.

2003 మార్చిలో, అమెరికా సైనిక బలగాలు దురాక్రమణ సాగించిన కాలంలో, ఇరాక్ ప్రజలనుండి తీవ్ర వ్యతిరేకత, ప్రతిఘటనను వారు ఎదుర్కొన్నారు. ఆయుధాల సంపూర్ణ ఆధిపత్యం, హత్యాకాండ, రక్త ప్రవాహాల ద్వారా ఆ ప్రజలపై ఆధిపత్యం నెరపటానికి కూడా సామ్రాజ్యవాదులకు దశాబ్దకాలం పట్టింది. కానీ ప్రజలు లొంగటానికి నిరాకరిస్తూ ఏదో ఒక రూపంలో నిలకడగా ప్రతిఘటిస్తూనే వచ్చారు.

ఈ అన్యాయమైన యుద్ధ పరిణామాలతో అమెరికా సామ్రాజ్యవాదులు కూడా తీవ్రమైన నష్టాలను చవిచూశారు. వారి ఆర్థిక సంక్షోభం, ప్రపంచంలో రాజకీయంగా ఒంటరి అయిన పరిస్థితి మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితి కారణంగానే తమ ఏజెంట్లకు అధికారాన్ని బదలాయించే నాటకమాడేందుకు వారు నెట్టబడ్డారు. 2006లో నూరియల్ – మాలిక్‌ల ప్రభుత్వపాలన ఈ పరిణామాల ఫలితమే. ఆపై, ఇరాక్‌నుండి అమెరికా సాయుధ బలగాల నిష్క్రమణ నాటకానికి 2011 ఏప్రిల్‌లో తెరతీశారు. కాగా, ఈనాటికీ 30వేల మంది అమెరికా సాయుధ సైనికులు 'లిలిప్యాడ్' స్థావరాలలో ఇరాక్‌లోని వివిధ ప్రాంతాలలో మోహరించి, ఏ నిముషంలో అమెరికా ఆదేశించినా తదనుగుణంగా మరునిముషంలో వ్యవహరించటానికి సిద్ధంగా వున్నారు.

ప్రస్తుతం, ఐఎస్‌ఐఎస్ రంగం మీదకువచ్చి, ఇరాక్ – సిరియా భూభాగాలలో ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పరచటమే లక్ష్యంగా ముందుకుసాగటంతో పరిస్థితిని అవగాహన చేసుకోవటం కష్టతరమేగాక, క్లిష్టమైంది. ఐఎస్‌ఐఎస్ అంత తేలికగా ఇరాక్‌లోని అనేక ప్రాంతాలను ఆక్రమించుకోవటమేగాక, ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పరిచినట్లుగా ప్రకటించుకునేంత శక్తివంతమైనదిగా ఏవిధంగా తయారైంది? అమెరికా మద్దతుతో కొసాగుతున్న మాలిక్ యొక్క ప్రభుత్వం, కనీస ప్రతిఘటన లేకుండా అనేక ప్రాంతాలను ఐఎస్‌ఐఎస్‌కు వదిలివేసేంత బలహీన, దయనీయ పరిస్థితిలో ఎందుకు వుండిపోవలసివచ్చింది? మాలిక్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచేందుకు అమెరికా ఎందుకు పెద్దగా ఆసక్తి కనబరచలేదు? తన మనుగడే ప్రశ్నార్థకమైన పరిస్థితులలో ఇరాక్‌లో జాతీయ విముక్తి ప్రభుత్వ ఏర్పాటు అవసరముందనే ప్రతిపాదనతో మాలిక్ ప్రభుత్వం ఎందుకు ముందుకు వచ్చింది? ఇరాక్‌పై తమ ఆధిపత్యాన్ని రుద్దటానికి దశాబ్దకాలంపాటు యుద్ధం సాగించిన అమెరికన్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా, ఇరాక్‌లో తన పాలన నెలకొల్పేందుకు సిద్ధమైన ఐఎస్‌ఐఎస్ పెదవి విప్పకపోవటం ఆశ్చర్యంగా లేదా? ఇక్కడ – ప్రతిఒక్కరూ అమెరికా సామ్రాజ్యవాదులు ప్రపంచాధిపత్యం కోసం సాగిస్తున్న రాజకీయాలను తప్పనిసరిగా అర్థంచేసుకోవాలి.

ఇతర దేశాలను, ఆ దేశ ప్రజలను లోబరుచుకునే తమ లక్ష్యాలను నెరవేర్చుకోవటానికి ఇతరేతర మార్గాలన్నీ నిరుపయోగమైనపుడు సామ్రాజ్యవాదులు సైనిక జోక్యం, దురాక్రమణలవంటి తీవ్ర విధానాలను ఉపయోగిస్తారు. వారి వైపునుండి యుద్ధాలు, ప్రపంచ యవనికపై వారి పాత్ర ఈ క్రమంలో ముందుకొచ్చినవే నంటారు.

మధ్యప్రాచ్యం–ఓ పెద్ద తరగని చమురు వనరు. కమ్మని మాంసంముక్కలా వున్న దీనిని ఎల్లవేళలా సామ్రాజ్యవాదులు గుటుక్కున మింగే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. కానీ, ఈ ప్రాంతం వారికి ఎప్పటికీ కొరకరాని కొయ్యగానే వుంది. ఇక్కడ – బడా, సంపన్న, ఫ్యూడల్ చక్రవర్తులు, ముస్లిము ఛాందసవాదశక్తులు, ప్రతీఘాతకులు మాత్రమేకాదు; 1917 అక్టోబరు విప్లవం, ఫాశిజం ఓటమి, వలసదేశాలలో జాతీయ విముక్తి ఉద్యమాల విజయాలు, పురోగమనంవంటి వివిధ చారిత్రక పరిణామాల ప్రభావ ఫలితంగా, జాతీయ, ప్రజాస్వామిక, లౌకిక, సామ్యవాదశక్తులు బలంపుంజుకొని ఈ ప్రాంతంలోని సామ్రాజ్యవాదులకు వారి కుమ్మక్కుదారులకు తీవ్ర సవాళ్ళను విసురుతున్నాయి. సాధారణంగా సామ్రాజ్యవాదులు – ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు ఈ జాతీయ, ప్రజాస్వామిక, లౌకిక, సామ్యవాదశక్తులను తుడిచి పెట్టటానికి, కొనివేయటానికి మరియు ఈ ప్రాంతంలోని ఫ్యూడల్, విప్లవప్రతీఘాతక, ఛాందసవాద శక్తులను ఆయా దేశాల ప్రభుత్వాలలో తమ దళారీలుగా జొప్పించుకొనటానికి, తమ ఏజెంట్లను ఏర్పరచుకోవటానికి సున్నితమైన మరియు హింసాయుతమైన పద్ధతులను అనుసరిస్తూ వస్తున్నారు. ఇజ్రాయిల్ యూదు జాత్యహంకార సైనికపాలకులను, పాలస్తీనా ప్రజల న్యాయమైన హక్కులను కాలరాచి, వారిని వారి మాతృభూమి నుండి పెకిలించివేసేందుకు ఒక సాధనంగా మాత్రమేగాక, ఇతర అరబ్‌దేశాలపై యుద్ధాలు సాగించేందుకు, ఆయా దేశాలను నిరంతర సంక్షోభాలలోకి నెట్టేందుకు, రాజకీయ అస్థిరత్వాన్ని నిరంతరం పెంచి పోషించేందుకు, విభజించి పాలించే రాజకీయాల ద్వారా ఆయా దేశాలను, ఆయా దేశాల ప్రజానీకాన్ని అంతిమంగా లోబరుచుకునేవైపుగా నెట్టేందుకు ఉపయోగిస్తున్నారు.

అమెరికా మాజీ విదేశాంగ శాఖామంత్రి కండొలిజా రైస్ 2006లో అంగీకరించినవిధంగా, అమెరికా సామ్రాజ్యవాదులు 'నూతన మధ్యప్రాచ్య విధానమ'నే నిర్దిష్ట విధానాన్ని అమలుచేస్తున్నారు. 'లెబనాన్, పాలస్తీనా, సిరియాలు మొదలుకొని ఇరాక్‌దాకా, పర్షియన్ గల్ఫ్, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో అస్థిరత్వాన్ని, గందరగోళాన్ని, హింసను సృష్టించటమే' ఈ విధానం యొక్క లక్ష్యం. రైస్ పేర్కొన్న దానిప్రకారం 'మొత్తం మధ్య ప్రాచ్యాన్ని పునర్ నిర్వచించేందుకు, తద్వారా ఒక పద్ధతి ప్రకారం అస్తవ్యస్తం గావించే శక్తులను ప్రయోగించే ఒత్తిడికి కేంద్రబిందువుగా' లెబనాన్‌ను ఉపయోగించాలని అమెరికా ప్రతిపాదించింది. ఆమె ఇంకా ఇలా పేర్కొన్నది: 'మేము (అమెరికా సామ్రాజ్యవాదులు) ఇక్కడ చూస్తున్న లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు, లెబనాన్ విధ్వంసమనేది 'నూతన మధ్యప్రాచ్య' పుట్టుకకు ముందటి పురిటి నెప్పులు. కాగా, మేము ఖచ్చితంగా చేయవలసినది దానిని మరింత ముందుకు తోయటము తప్పితే, పాత దానికి తిరిగి వెళ్ళేందుకు కాదు'. ఇన్ని సంవత్సరాలకాలంగా, ఈ విధానాన్ని అమలుచేసేందుకే కృషిచేస్తూ వస్తున్నారు.

మొత్తంమీద సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు ప్రపంచంలో తమ ఆధిపత్య విధానాన్ని ముందుకు నెట్టటానికి ఉగ్రవాదశక్తులు, సంస్థలు, ఉగ్రవాద కార్యకలాపాలను ఒక ముఖ్యమైన సాధనంగా చేసుకున్నారు. వారు అనేక పేర్లతో అసంఖ్యాకమైన ఉగ్రవాద సంస్థలను సృష్టించి ఈ ప్రాంతంలో అస్థిరత్వం కల్గించేందుకు, దేశాలను విభజించి విడగొట్టేందుకు, నిజాయితీగా సాగే ఉద్యమాలను, శక్తులను విచ్ఛిన్నంచేసి, ప్రక్కదారి పట్టించేందుకు, ఇతర దేశాలపై తమ దాడులు, జోక్యానికి భూమికను తయారుచేసేందుకు ఉపయోగిస్తూ వున్నారు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో ఏ ఒక్కదేశమూ ఈరకపు తీవ్రవాద చర్యలకు లోనుగాకుండా లేదు. అమెరికా సామ్రాజ్యవాదపు 'ఉగ్రవాదంపై ప్రపంచ స్థాయి పోరాటం'గా చెప్పబడే ప్రకటన ప్రత్యేకించి 2001 సెప్టెంబరు తదనంతర కాలంలో వారిని ఉగ్రవాద వ్యతిరేకులుగా నిలపలేదు. ఒకవైపున వారి అభిమాన పాత్రులు కానివారిని, వారికి వ్యతిరేకులుగా వున్నవారిని లక్ష్యంగా చేసుకొని 'ఉగ్రవాద వ్యతిరేకపోరాటమ'నే ఒక సాకుతో లేదా లైసెన్స్‌తో ఆయా దేశాల సార్వభౌమాధికారాన్నీ, స్వాతంత్ర్యాన్ని, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించటమేగాక దురాక్రమణ యుద్ధాలకు పాల్పడుతున్నది. మరోవైపున, కొత్త, పాత ఉగ్రవాద సంస్థలను సృష్టించి, ఉనికిలో ఉంచుతూ, వాటిని ఉపయోగించటమనే విధానాలను వారు కొనసాగిస్తున్నారు.

లిబియా అధ్యక్షుడు గడాఫీని అధికారం నుండి కూలదోయటానికి ఉగ్రవాదసంస్థలకు అమెరికా సామ్రాజ్యవాదులు ఆయుధాలు అందజేశారు. ఈ ఆయుధాలు లిబియాను అస్థిరపరచటమేగాక, మరి అనేక దేశాలను ఘోరమైన అభద్రతకు, గందరగోళానికి నెట్టివేశాయి. సిరియాలో ప్రభుత్వాన్ని మార్పుజేసే పరిస్థితులను సృష్టించేందుకు టర్కీ, జోర్డానుల ద్వారా తిరుగుబాటుదారులకు అమెరికా సామ్రాజ్యవాదులు భారీసహాయం చేశారు. పశ్చిమాసియాలో అమెరికాకు నమ్మకమైన మిత్రదేశాలైన సౌదీఅరేబియా, ఖతార్ మరియు కువాయిట్‌లు అసద్ నాయకత్వంలోని సిరియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసే అన్ని ఉగ్రవాద సంస్థలకు లక్షల డాలర్ల ఆర్థిక సహకారాన్ని అందజేశారు. 'ఫ్రీ సిరియా ఆర్మీ'గా పిలవబడేది – ఒక ఉగ్రవాద సంస్థ. ఇది అమెరికా సామ్రాజ్యవాదుల సృష్టి. ఫ్రీసిరియా ఆర్మీ(ఎఫ్ఎస్ఏ) తన కర్తవ్యాల నిర్వహణలో విఫలమవుతుండగా, అల్‌ఖైదా మరో రూపమైన ఐఎస్‌ఐఎస్ రంగప్రవేశం చేసింది. జభత్–అల్–నుస్రా(మద్దతు కూటమి) జెండా క్రింద అసద్‌ను పడదోసే ఉగ్రవాద కార్యకలాపాలను ఈ సంస్థ చేపట్టింది. ఈ ప్రాంతాన్ని అస్థిరపరిచేందుకు ఈ ఉగ్రవాద సంస్థను అమెరికా సృష్టించటమేగాక, దీనికి ఆయుధాలను, నిధులను అమెరికానే సమకూరుస్తూ వస్తోంది.

ఇరాక్‌లో పరిణామాలనొక్కసారి పరిశీలిస్తే, సద్దామ్‌హుస్సేన్ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని కూలదోయటంతో, దాని నాయకత్వాన్ని సంపూర్ణంగా తొలగించటంతో, ప్రజలపై క్రూరమైన నిర్బంధాన్ని ప్రయోగించటంతో అమెరికా సామ్రాజ్యవాదులు ఆగిపోలేదు. ఇరాక్‌లోని పునాది నిర్మాణాలను ధ్వంసం చేశారు. ఇరాక్ సైన్యంలోని 7 లక్షలమంది సున్నీలను ఉద్యోగాల నుండి తొలగించారు. మాలిక్ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ రకమైన 'శుద్ధి' కార్యక్రమాలనింకా కొనసాగిస్తూనే వుంది. బాత్‌పార్టీ సభ్యులుగానో లేదా ఆ పార్టీ విధేయులుగానో పరిగణించే వారిని సైనిక, పౌర అధికారులుగా నియమించటాన్ని ప్రభుత్వం నిషేధించింది. అత్యంత క్రూరమైన ప్రత్యేకమైన సైనిక విభాగాన్ని మాలిక్ ప్రభుత్వం ఏర్పరుచుకొంది. ఈ చర్యలన్నీ ఇరాక్ సమాజాన్ని షియా, సున్నీలుగా నిట్టనిలువుగా వివక్షకు, విభజనకు గురిచేసి, వారిమధ్య పరస్పరం తీవ్రమైన సంకుచితయుద్ధాలకు దారితీశాయి.

ఈనాడు ఐఎస్‌ఐఎస్ ఇరాక్‌లోని నిర్దిష్ట ప్రాంతాలను ఆక్రమించుకొనే ధోరణి ప్రాధాన్యతను సంతరించుకోవటంతో, అమెరికా మరియు దాని మిత్రకూటమి దేశాలు ఇరాక్ సమాజంలోని వివిధ సమూహాల మధ్య సమతుల్యాన్ని కాపాడాల్సిన అవసరాన్ని గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు. ఇరాక్‌లో జాతీయ విముక్తి ప్రభుత్వం గురించి వారు ప్రబోధిస్తున్నారు. కానీ ఇది ఓ కుటిల ప్రతిపాదన. ఎందుకంటే, ఇరాక్ సమాజాన్ని విభజించటానికి అమెరికా ఇప్పటికే ఎంతో చేసింది. మనం ఇప్పటికే పేర్కొన్నట్లుగా మధ్యప్రాచ్య ప్రాంతంలోని సార్వభౌమాధికార దేశాలను విడగొట్టి తెగ, జాతి ప్రాతిపదికలపై ఆయా దేశాలను పునర్నిర్మించాలనే తన పథకానికనుగుణంగా అమెరికా ఇప్పటికే వ్యవహరిస్తూ వస్తున్నది. పశ్చిమ ఆసియాలో అమెరికా విధానాన్ని ముందుకు తీసుకువెళ్ళే ముఖ్యమైన వాహకంగా వ్యవహరిస్తున్న ఇజ్రాయిల్ పాలకులు తమ ఒకానొక విధాన పత్రాలలో ఈ విధంగా పేర్కొన్నారు: "ఒకవైపున చమురు వనరులలో ప్రసిద్ధిగాంచిన ఇరాక్ మరోవైపున అంతర్గతంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటూ సిరియాకంటే మాకు ప్రాముఖ్యమైనదిగా వుంది. సిరియాలో అట్టోమన్ కాలంలోలాగా ఇరాక్‌లో మత, తెగల ప్రాతిపదికన రాష్ట్రాల విభజన సాధ్యమే. కనుక, మూడు ప్రధాన నగరాల చుట్టూ మూడు అంతకుమించి రాష్ట్రాలు బాస్రా, బాగ్దాద్, మసూల్‌లు మనగలుగుతాయి. దక్షిణాన షియాల ప్రాంతాలు ఉత్తరాన కుర్దుల, సున్నీల నుండి వేరుపడతాయి" వాస్తవానికి, మధ్యప్రాచ్యంలో అమెరికా వ్యూహమిదే.

ఇప్పటికే పేర్కొన్నట్లుగా, అమెరికా సృష్టించిన అల్‌ఖైదా అనుంగు సంస్థే ఐఎస్‌ఐఎస్. మధ్యకాలాల నాటి ఇస్లాము రాజ్యాన్ని ఏర్పాటుచేసే ఉద్దేశ్యంలో ఇది వుంది. అబుబకర్–అల్–బగ్దాదీ తనకు తానుగా ఖలీఫాగానూ, ప్రపంచంలో ముస్లిములందరకు నాయకునిగానూ ప్రకటించుకున్నాడు. క్రూరమైన చర్యలను, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేయటంలో పేరెన్నికగన్న ఉగ్రవాద సంస్థ ఇది. ఇరాక్‌లో ప్రజాస్వామిక, సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తులు బలహీనంగావున్న ఆ ఖాళీలోకి ఐఎస్‌ఐఎస్ ప్రవేశించి, మాలిక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యక్తమవుతున్న విస్తారమైన అసంతృప్తిని ఉపయోగించుకొని లబ్ధి పొందింది.

ఇరాక్‌లో ఐఎస్‌ఐఎస్ ఏకశిలాసదృశమైన జీహాదీ సంస్థ కాదు. ఐఎస్‌ఐఎస్ ముఖ్యులలో రెండు జీహాదీ గ్రూపులుండగా, మరికొన్ని సభ్య సంస్థలు కూడా వున్నాయి. ఇరాక్‌కే పరిమితమై, స్వంత సున్నీల రాజ్యాన్ని ఏర్పరచటానికి పరిమితమైన సలాఫిస్ట్ గ్రూపు; సున్నీల, కుర్దుల ప్రాంతాలను ఒక ఇరాకీయుల సమాఖ్యగా ఏర్పరచాలనే ముస్లిమ్ బ్రదర్‌హుడ్ అనుబంధగ్రూపు; సద్దామ్‌హుస్సేన్ సైన్యంలోని అత్యధికులైన ఆదివాసీ సేనానులు, సైనికులు మరియు నక్షబడి గ్రూపువంటివి సమైక్య ఇరాక్‌ను కోరుతుండగా, గత బాతిస్టు పార్టీతో సంబంధాలున్న శక్తులు, ఇస్లాం రాజ్యఏర్పాటువంటి ఎజెండాతో సంబంధాలు లేకుండా బాతిస్ట్ పాలనను పునరుద్ధరించాలని కోరుకునేవారు... ఇలా అనేక రకాలవారున్నారు.

కనుక, ఐఎస్‌ఐఎస్ అనేది వారి వారి ఎజెండాలు కలిగివుండి సమైక్యంగా మాలిక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వుండే వివిధ శక్తుల ఓ కూటమి. ఈ కూటమిలోని ఇస్లామిక్ జీహాదీ గ్రూపులు, కూటమిలోని నాయకత్వ స్థానంలో వుండే అనుకూలతను ఉపయోగించుకొని ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పరచేందుకు ముందుకు నెడుతున్నారు. రానున్న రోజులలో ఇది ఐఎస్‌ఐఎస్‌లో వైరుధ్యాలను, విభేధాలను తీవ్రం చేస్తుంది. 'ఇస్లామిక్ రాజ్యస్థాపన'నే విధానం దేశాల మధ్య సరిహద్దు రేఖలను చెరిపివేసి, ప్రపంచాన్ని మత ప్రాతిపదికన విభజించాలని ప్రతిపాదిస్తుంది. ఇరాకీ ప్రజలు తమ దేశవిభజనను, ఇస్లామిక్ రాజ్యఏర్పాటును ఎన్నటికీ కోరుకోరు. దేశవిభజన దేశాన్ని బలహీన పరుస్తుందని, భయంకరమైన సంకుచిత యుద్ధాలకు దేశాన్ని గురిచేస్తుందనే విషయం ప్రజలకు తెలుసు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమైక్య, సర్వసత్తాక, స్వతంత్ర, ప్రజాతంత్ర ఇరాక్ కోసం ముందుకు సాగేందుకు ఆటంకంగా నిలిచి ప్రజలను అత్యంత అననుకూల, కష్టభరితమైన పరిస్థితులలోకి నెడ్తుంది.

అమెరికా సామ్రాజ్యవాదులకు ఐఎస్‌ఐఎస్ శక్తులతోనూ, ఇరాక్‌లో తాము ఏర్పరిచిన ప్రభుత్వంతోనూ బలమైన సంబంధాలున్నాయి. వారు ఎప్పుడైనా, తామేది సరైనదని భావిస్తే ఆవిధంగా వ్యవహరించగలుగుతారు. తద్వారా పరిస్థితిని చేయిదాటిపోనివ్వకుండా, ఐఎస్‌ఐఎస్ శక్తులకు మార్గనిర్దేశం చేస్తూ, పరిణామాల క్రమాన్ని తమకనుకూలంగా, తమ ప్రయోజనాలకు బలంచేకూర్చే విధంగా, ఇరాక్‌పై తమ పట్టు, ఆధిపత్యం బలపడే విధంగా వ్యవహరించగలుగుతారు.

ఈ పరిస్థితులలో జాతీయ, ప్రజాస్వామిక, ప్రగతిశీలశక్తులు సామ్రాజ్యవాదానికి, వారి అనుయాయులకు వ్యతిరేకంగానూ, అదేవిధంగా విభజనవాద, ఇస్లాము ఛాందసవాదానికి వ్యతిరేకంగానూ జరిపే పోరాటం, సమైక్య, సర్వసత్తాక, ప్రజాతంత్ర, స్వతంత్ర ఇరాక్ కోసం జరిపే పోరాటాన్నుండి విడదీయలేనిది. ఈ పోరాటం కష్టతరమైనదే కానీ అనివార్యమైనదిగా ముందుకు సాగుతుంది. ✶





వెలువడింది

**సోవియట్ యూనియన్‌లో స్త్రీల పరిస్థితి**

రచన : **జి.యన్. సెరిబ్రెన్నికోవ్**

అనువాదం : **తోలేటి జగన్మోహనరావు**

ప్రచురణ : **తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్**

వెల : **రూ. 120/-**

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్**

**28-9-1, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 2**

# గాజాపై ఇజ్రాయిలు దాడులను ఖండించండి!

**200** చ.మైళ్ల చిన్నప్రాంతమైన గాజాలో నివశిస్తున్న 18 లక్షలమంది పాలస్తీనీయనులపై జులై నెలనుండీ ఇజ్రాయిలు సాగిస్తున్న బాంబు దాడులను "జనశక్తి" తీవ్రంగా ఖండిస్తున్నది. ఈ దాడులలో వెయ్యి మందిపైగా పాలస్తీనియన్లు చనిపోగా, వేలాది మంది గాయపడ్డారు. 2008లోనూ, 2009లోనూ, తిరిగి 2012లోనూ గాజాపై ఇజ్రాయిలు సాగించిన బాంబు దాడుల తీరులోనే నేటి దాడులూ సాగుతున్నాయి. ఈ దాడులు ముందుగా రచించిన ఒక పథకం ప్రకారం సాగిస్తున్న నేరాలు.

మొదటగా ఇజ్రాయిలు కొన్ని వాస్తవాలను వండివార్చుతున్నది. గాజా ప్రాంతం నుండి తనపై రాకెట్టు దాడులు జరిగినందున ఆత్మరక్షణకు తాను తిరిగి దాడులు చేస్తున్నట్లు చెప్పుకుంటున్నది. దీనిని పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు ప్రచారం చేసి సమర్ధిస్తున్నాయి.

జూన్ నెలలో ముగ్గురు ఇజ్రాయిలు యువకులు వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో గల్లంతయ్యారన్న సాకుచెప్పి, వారిని వెదుకులాడే పేరుతో 600 మంది పాలస్తీనియన్లను అదుపులోకి తీసుకుంది. వెయ్యి ఇళ్ల మీద బాంబులు వేసింది. మసీదులు, కాఫీహోటళ్లు, ఆస్పత్రులు, పాఠశాలలమీద కూడా బాంబులు వేసింది. మంచినీటి సరఫరా కేంద్రాలనూ, మురుగునీరు శుభ్రపరిచే కేంద్రాలనూ నాశనం చేసింది.

ఈజిప్టు మధ్యవర్తిగా అంగీకరించిన 2012 నాటి కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాలస్తీనా ప్రభుత్వం ఉల్లంఘించినందున దాడులు చేయాల్సివచ్చిందంటూ ఇజ్రాయిలు చేసుకుంటున్న సమర్ధన అర్ధంలేనిది. పాలస్తీనా కోరిన ముఖ్యమైన అంశాలు–ఆర్థిక ఆంక్షల తొలగింపు, అదుపులోకి తీసుకున్న పాలస్తీనియన్ల విడుదల–లేకుండానే ఈ ఒప్పందాన్ని ప్రతిపాదించారు. దీనిని సహజంగానే హమాస్ తిరస్కరించింది. "మేము కాల్పుల విరమణ కోరుకుంటున్నాము. దానికి ఏదైనా మూల్యం చెల్లించడానికి సిద్ధంగా లేము. మేము పశువులంకాదు. ఆర్థిక ఆంక్షలు తొలగించని, ఉద్యోగాలు యివ్వని, వేతనాలు యివ్వని కాల్పుల విరమణ అర్ధంలేనిది" అని హమాస్ మంత్రి ప్రకటించాడు.

పత్రికావార్తల ప్రకారం, ఇజ్రాయిలు సైన్యం తెల్ల ఫాస్ఫరస్ గ్యాసును ప్రయోగించింది. వందలాది మంది ఈ గ్యాసుకు గురై ఆస్పత్రుల్లో చేరారని పాలస్తీనా ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఇదే గ్యాసును 2008, 2009 దాడుల్లో కూడా ఇజ్రాయిలు ప్రయోగించింది. ఇరాక్ దురాక్రమణ సందర్భంలో ఫలూజా నగరంపై అమెరికా సామ్రాజ్యవాదం ఈ గ్యాసును ప్రయోగించింది. వారే ఈ మారణాయుధాన్ని ఇజ్రాయిలుకు సరఫరా చేశారు.

ఇజ్రాయిలు ప్రధానమంత్రి నెటన్యాహు అధికారిక ప్రతినిధులు పాలస్తీనాలోని హమాస్ ప్రభుత్వాన్ని కూలద్రోయటం ఈ దాడుల లక్ష్యం కాదని స్పష్టంగా చెప్పారు. పెద్దఎత్తున వినాశనాన్ని, మరణాలను కలుగజేసి వెనక్కు రావటమే ఈ దాడుల లక్ష్యమని చెప్పారు. గాజా ఉత్తరప్రాంతంలోని ఆరు పట్టణాలను ఖాళీచేసి గాజా నగరానికి తరలిపొమ్మని ఇజ్రాయిలు సైన్యం ఆజ్ఞలు జారీ చేసింది. అలాగే గాజా మధ్య ప్రాంతంలో వున్న నాలుగు పట్టణాలనూ, దక్షిణాన రెండు పట్టణాలను ఖాళీచేయమని ఇజ్రాయిలు సైన్యం ఆజ్ఞలు యిచ్చింది.

ఈలోగా ఈజిప్టు కలుగజేసుకుని కాల్పుల విరమణను ప్రతిపాదించింది. దీనికి ఇజ్రాయిలు అంగీకరించింది. కాగా గాజా నుండి ఇజ్రాయిలు సైన్యాలు తప్పుకోవాలనీ, బందీలను విడుదల చేయాలనీ, ఆర్థిక ఆంక్షలను తొలగించాలనీ అప్పుడు మాత్రమే కాల్పుల విరమణ అర్థవంతంగా వుంటుందనీ చెప్పింది.

24గంటలు గడవకుండానే అంగీకరించిన కాల్పుల విరమణను ఇజ్రాయిలు తుంగలో తొక్కింది. జులై 27అర్ధరాత్రి నుండీ తిరిగి బాంబుదాడులు సాగించింది. సరిహద్దులకు దగ్గరనున్న పట్టణాలన్నింటినీ ధ్వంసం చేసింది. సరిహద్దు నుండి 5 కి.మీ. వరకూ వున్న గాజా ప్రాంతాన్ని (దాదాపు సగం వైశాల్యాన్ని) మధ్యస్థ ప్రాంతంగా (బఫర్) ప్రకటించింది. అంటే అక్కడెవరూ నివాసం వుండరాదు. 1031 మంది వరకూ మరణించి వుంటారనీ, 6వేల మందికి పైగా గాయపడి వుంటారనీ గార్డియన్ పత్రిక రాసింది. ఒక లక్షా 67 వేల 279 మంది పాలస్తీనియన్లు నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి సహాయ కార్యక్రమాల సంస్థ ప్రకటించింది.

ఇజ్రాయిలు ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నది. యుద్ధ ఖర్చును తగ్గించివేసి, సంక్షేమ కార్యకలాపాలకు నిధులు వెచ్చించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అసంతృప్తిని దారిమళ్లించి, యుద్ధఖర్చులను సమర్ధించుకొనేందుకు "బయట నుండి ప్రమాదాన్ని" చూపెట్టడం అన్న మార్గాన్ని నెటన్యాహు ప్రభుత్వం ఎంచుకుంది. గాజాపై ప్రస్తుత దాడులకు ఇదొక కారణం.

పాలస్తీనాలోని రెండు ప్రధాన రాజకీయపక్షాలు – హమాస్, అల్‌ఫతాలు – తమ మధ్య విబేధాలను ప్రక్కనపెట్టి, ఒక అవగాహనకు వచ్చాయి. ఐక్య ప్రభుత్వాన్ని ఏర్పరచాయి. ఈ ఒప్పందం ప్రకారం ప్రభుత్వ నిర్వహణకు 2014లోగా ఎన్నికలు జరగాల్సి వుంది. ఈ పరిణామం ఇజ్రాయిలుకు, పశ్చిమ సామ్రాజ్యవాదులకు రుచించలేదు. 2006లో పాలస్తీనా ప్రాధికార సంస్థకు జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో హమాస్ గెలుపొందినప్పటికీ ఇజ్రాయిలు దానిని గుర్తించ నిరాకరించింది. ఈనాటికీ హమాస్‌ను "టెర్రరిస్టు"గానే పేర్కొంటున్నది. గాజాపై ప్రస్తుత ఇజ్రాయిలు దాడులకు ఇది మరొక కారణం.

ఈ దాడులకు ఇజ్రాయిలు సమాధానం చెప్పాలని ఐరాస భద్రతా మండలిలో తీర్మానం కోసం సాగుతున్న ప్రయత్నాలను అమెరికా సామ్రాజ్యవాదం అడ్డుకుంటున్నది. ఆవిధంగా ఇజ్రాయిలు క్రూరదాడులు సాగించటానికి ఎలాంటి ఆటంకాలులేకుండా చేస్తున్నది. ఇజ్రాయిలు నిరంతరాయంగా మారణాయుధాలను సరఫరా చేస్తున్నది. మధ్యఆసియా దేశాల సరిహద్దులను తిరగరాసి, తిరుగులేని ఆధిపత్యాన్ని పొందాలన్న తన పథకంలో భాగంగా ఇజ్రాయిలుకు అన్ని రకాలుగా మద్దతునిస్తున్నది.

"అమాయక ప్రాణాలు బలికావటం అత్యంత విషాదకర"మంటూ మొసలికన్నీరు కార్చిన యురోపియన్ యూనియన్ "తన ప్రజలను రక్షించుకునే హక్కు ఇజ్రాయిలుకుందంటూ" ఇజ్రాయిలు దాడులను సమర్ధించింది.

పాలస్తీనా ప్రజల హక్కులకు భారత ప్రభుత్వం తెల్పిన మద్దతును, అమెరికా సామ్రాజ్యవాదంతో "వ్యూహాత్మక భాగసామ్య" ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత క్రమంగా నీరుగార్చుతూ వచ్చింది. ఈ ఒప్పందంపై చర్చలు మొదటి ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రారంభించగా, యుపిఏ ప్రభుత్వం సంతకాలు చేసింది. నరేంద్రమోడీ ప్రభుత్వం ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నది. "ఇరుపక్షాల మధ్య తగవులో జోక్యం చేసుకోబోమం"టూ సమాన దూరాన్ని పాటిస్తామని ప్రకటించింది. దురాక్రమణదారుడినీ, దురాక్రమణకు గురైనవారినీ, ప్రస్తుత సందర్భంలో బాంబుదాడులతో విధ్వంసానికి పాల్పడిన నేరస్తుడినీ, దాడులకు గురైన బాధితులను ఒకే గాటన కట్టే వైఖరితో నరేంద్రమోడీ ప్రభుత్వం దురాక్రమణను సమర్ధించింది. అమెరికా సామ్రాజ్యవాదానికి వంతపాడి, దానికి నమ్మకమైన సేవకుడిగా మరోసారి చెప్పుకుంది.

పాలస్తీనా ప్రజలపై సామ్రాజ్యవాదుల మద్దతుతో ఇజ్రాయిలు సాగిస్తున్న దురాక్రమణ యుద్ధదాడులను ప్రపంచ ప్రజలు ఎలుగెత్తి ఖండించాలి. ఈ దాడుల క్రూరత్వం శ్రామిక ప్రజలలో దోపిడీ పాలకవర్గాల పట్ల ఏహ్యతను పెంచుతున్నదని ప్రపంచమంతటా సాగుతున్న నిరసనలు తెలుపుతున్నాయి.

న్యూయార్క్ నగరం నడిబొడ్డున టైమ్స్ స్క్వేర్‌లో ఇజ్రాయిలు దాడులను ఖండిస్తూ 3వేల మంది ప్రదర్శన చేశారు. చికాగో నగరంలో జరిగిన నిరసన ప్రదర్శనలో 10వేలమంది పాల్గొన్నారు. ఆరెగాన్ రాష్ట్ర కేంద్రంలో సాగిన నిరసన ప్రదర్శనలో "ఒబామా ఈరోజెంతమంది పిల్లలు చనిపోయారో లెక్కచెప్పు" అనీ "ఇజ్రాయిలు నేరాలకు ఒక్కపైసా యివ్వరాదు" అనీ నినదించారు.

ఫ్రాన్సులోని సోషలిస్టు పార్టీ ప్రభుత్వం ప్రదర్శనలను నిషేధించినప్పటికీ, పారిస్ మార్సెల్లీ, లియాన్, రిల్లెలలో వేలాదిమంది నిరసన ప్రదర్శన చేశారు. పోలీసులు 50మందిని అరెస్టు చేశారు. లండన్‌లో 60వేల మంది నిరసన ప్రదర్శన చేశారు. ఇజ్రాయిలు రాయబార కార్యాలయం నుండి పార్లమెంటు వరకూ ప్రదర్శన సాగింది. ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో 2 వేలమంది ప్రదర్శనలో పాల్గొని నిరసన తెలిపారు.

జర్మనీ రాజధాని బెర్లిన్‌లోనూ ఫ్రాంక్‌ఫర్ట్ తదితర నగరాలలోనూ వేలాదిమంది నిరసన ప్రదర్శనలు చేశారు. వీరిలో జర్మనీ దేశ యూదులు కూడా పాల్గొన్నారు. "మానవ హక్కుల ఉల్లంఘనకు ఇజ్రాయిలును ఖండించమంటే యూదు వ్యతిరేక తత్వంకాదు" అన్న ప్లకార్డులు వారు ప్రదర్శించారు.

బెల్జియం, ఇటలీ, స్విట్జర్లాండులలో కూడా నిరసన ప్రదర్శనలు సాగాయి. దాదాపు మూడవ ప్రపంచదేశాలన్నిటా ఇజ్రాయిలు దాడులను ఖండిస్తూ ప్రదర్శనలు జరిగాయి. ✡

# ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో చేనేత సదస్సు

**వేటపాలెం, 16-7-14 :**

రోజురోజుకు తీవ్రమౌతున్న చేనేతరంగ సంక్షోభం, నానాటికీ దిగజారిపోతున్న కార్మికుల జీవనం, కొరవడుతున్న జీవన భద్రత, పెరుగుతున్న కార్మికుల వలసల నేపథ్యంలో జులై 16వ తేదీన ప్రకాశం జిల్లా వేటపాలెంలో ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో "చేనేత సదస్సు" జరిగింది. కార్మికుల నినాదాల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైన సదస్సుకు పెద్దసంఖ్యలో కార్మికులు, కార్మిక మహిళలు, చేనేత శ్రేయోభిలాషులు హాజరయ్యారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై కళాకారులు పాడిన పాటలు సభికులను ఆలోచింపజేశాయి.



చేనేత సదస్సుకు హాజరైన ప్రజానీకం; సదస్సులో ప్రసంగిస్తున్న సోనీ

ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం (ఆం.ప్ర.) నాయకులు కా॥ వార్తికోట సుబ్బారావు, కా॥ యారాసు విజయభాస్కర్‌లు అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ సదస్సులో ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం(ఆం.ప్ర.) రాష్ట్రకన్వీనర్ కా॥ వై.సోనీ ప్రధానవక్తగా మాట్లాడుతూ.. నాటి తెల్లపాలకులు చేతులు, వేళ్ళు, నరకటం వంటి క్రూరమైన పద్ధతులను అనుసరిస్తే, నేటి మన పాలకులు నాజూకైన పద్ధతిలో మన చేనేతకు 'చరమగీతం' పాడుతున్నారన్నారు. నూతన జౌళీ విధానం, ఆధునికీకరణ పేరుతో పవర్‌లూమ్, జెట్‌లూమ్‌లను దిగుమతి చేయటం, సమీకృత మిల్లులను స్థాపించటం, విదేశీ, స్వదేశీ బహుళజాతి కంపెనీల స్థాపనను ఒకవైపున ముమ్మరం చేస్తున్నారన్నారు. మరోవైపు చేనేతకు ప్రాణాధారమైన చిలుపలనూలు, రంగులు, రసాయనాలు, పట్టు, జరీ రేట్లు విపరీతంగా పెంచి చేనేత బట్ట ఉత్పాదకవ్యయాన్ని అనేక రెట్లు పెంచుతూ చేనేతకు కేటాయించిన 22 రకాల బట్టలను పవర్ మగ్గాలపై అనుమతించి, వాని ఉత్పత్తిని, విక్రయాన్ని ప్రోత్సహిస్తూ, ప్రపంచ మార్కెట్ జూదంలో చేనేతను బలిపశువును చేస్తున్నారన్నారు. భారత దళారీ పాలకుల ఈ విధానాల ఫలితంగా వేలాదిమంది చేనేత, మరమగ్గాల కార్మికులను బలవన్మరణాలకు బలి చేశారని, అంతకుమించిన సంఖ్యలో వృత్తి వదలి పారిపోయే, వలసలుపోయే దయనీయ స్థితికి నెట్టారని అన్నారు. కుటుంబసభ్యులందరూ రోజుకు 18 గంటలు రెక్కలు ముక్కలు చేసుకున్నాగానీ కనీస వేతనం పొందలేకపోవడం అన్నది సగటు నేతన్న జీవితమని, దాంతో పనిభద్రత, జీవన భద్రతలు ప్రశ్నార్ధకమై కార్మికులు నూతిని, గోతిని వెదుకుతున్నారని అన్నారు. ఈ పరిస్థితులు మారాలంటే పాలకులు అనుసరించే సామ్రాజ్యవాద, బహుళజాతికంపెనీలకు అనుకూలమైన ప్రపంచీకరణ, ప్రపంచబ్యాంకు విధానాలను తిప్పికొట్టి, చేనేత వృత్తిని పరిరక్షించుకునే జీవనోపాధిని నిలుపుకునే జీవన్మరణాల పోరాటంలో మహిళలతోసహా చేనేత కార్మికులంతా సమీకృతులవ్వాలని ఒక వర్గంగా సంఘటితమవ్వాలని పిలుపునిచ్చారు.

అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య (న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్. స్వామి మాట్లాడుతూ ప్రపంచ కార్మికవర్గం 130 ఏళ్ళ క్రితమే 8 గం॥ల పనిదినం సాధించుకోవటం కోసం తమ రక్తం చిందించి, మేడే అరుణపతాకను ఎగురవేసి 8 గం॥ల పనిదినం హక్కుగా సాధించుకున్నదనీ, కానీ మన చేనేత కార్మికులకు 8 గం॥ల పనిదినం నేటికీ కలగానే మారిందని అన్నారు.

ప్రపంచ కార్మికవర్గంతో మమేకమై చేనేత శ్రమజీవులు కూడా 8 గం॥ల పనిదినం, శ్రమకుతగిన వేతనం, జీవన భద్రత, మెరుగైన జీవితం పొందటం వంటి ప్రజాస్వామిక హక్కులను సాధించుకోవాలని, కోల్పోయిన హక్కులు తిరిగి పొందటం కోసం, మెరుగైన జీవనం హక్కుగా పొందటం కోసం, స్వేచ్ఛ, సమానత్వం, సహోదరత్వం సాధించుకోవటం కోసం, నూతన ప్రజాతంత్ర వ్యవస్థ నిర్మాణమే ధ్యేయంగా శ్రమజీవులందరూ వర్గప్రాతిపదికన సంఘటితమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ ఎన్. కుటుంబరావు మాట్లాడుతూ... అసంఘటితంగా ఉన్న చేనేత కార్మికులను సంఘటితపరిచే కృషిలో భాగంగా ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్రమంతటా సాగిస్తున్న కృషిలో భాగంగా చీరాల – వేటపాలెం ప్రాంతంలో గత 45 ఏళ్ళుగా చేనేత కార్మికులతో మమేకమై ముందుకు సాగుతుందని, ఆ క్రమంలోనే 1985లో ఈ ప్రాంతంలో ఏర్పాటుచేయ తలపెట్టిన 'పవర్‌లూమ్' పరిశ్రమను తిప్పికొట్టడంలోనూ, చేనేత వస్త్రనిల్వలు కొనుగోలుచేయాలని సాగిన ఆకలియాత్రకు నాయకత్వంవహించిందని, చేనేత కార్మికుల ఆకలిచావుల నేపథ్యంలో 'ఐక్యకార్యాచరణ' కృషి సాగించటంలో క్రియాశీలక పాత్ర పోషించిందని, ఆ కృషికి కొనసాగింపుగా 2009 నుండి కార్మికుల మజూరీల సాధన ఉద్యమంలో ప్రధాన భూమిక నిర్వహిస్తోందని ఆ కృషిని మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘ రాష్ట్రనాయకులు కా॥ సతీష్ మాట్లాడుతూ వృత్తిరక్షణ అన్నది కార్మికుల, యజమానుల జీవనోపాధికి, చేనేత భద్రతకు ముఖ్య అవసరమని, అందుకోసం ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు పరస్పర అవగాహన, సహకారంతో నడవాలని, తద్వారా సాధించే ఐక్యతతో వృత్తి రక్షణ కోసం ఉద్యమించాలని కోరారు. ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కా॥ జగ్గారపు సుబ్బారావు; కా॥ దొంతు శ్రీనివాసరావు, చేనేత కార్మిక మిత్రమండలి నాయకులు, కన్వీనర్ కా॥ మధుసూధనరావులు సందేశాలు ఇచ్చారు. అనంతరం చేనేతకవసరమైన ముడిసరుకులను ఉత్పత్తి ధరలకే అందించాలని; ప్రభుత్వమే చేనేత బట్టలను ఉత్పత్తి చేయించి, కొనుగోలు చేసి అమ్మకం జరపాలని; చేనేతకు కేటాయించిన 22 రకాల రిజర్వేషన్‌లను పవర్‌లూమ్‌ల ద్వారా ఉత్పత్తి చేయించటాన్ని నిరోధించాలని; పెరుగుతున్న ధరలు, జీవన ప్రమాణాల ఆధారంగా కనీసవేతనం రూ.10 వేలకు తగ్గకుండా నిర్ణయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సదస్సు తీర్మానించింది.

ఈ సదస్సులో ఇంకా కామ్రేడ్స్ జి.సుబ్బారావు, విశ్వనాథం, జ్ఞానప్రసూనాంబ, పార్వతి, శ్యామల, ధనలక్ష్మి, తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ✡

Read ! Subscribe!!
Class Struggle
Organ of Central Committee of CPI (ML)

# విద్యార్థుల చదువులతో చెలగాట మాడుతున్న దోపిడీ పాలకవర్గాలు

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్ర విభజన బిల్లులో లోపాలున్నాయనీ, వాటిని సవరించిన తర్వాతే పార్లమెంటు ఆమోదించాలనీ ఆనాడు వాదించిన వారు నేడు చట్టాన్ని యధాతథంగా అమలు జరపాలని వాదిస్తున్నారు. బిల్లును యథాతథంగా తక్షణమే ఆమోదించాలని వాదించినవారు నేడు చట్టం సమాఖ్యస్ఫూర్తికి విఘాతం కల్గిస్తున్నదనీ, రాష్ట్ర అధికారాలకు తూట్లు పొడుస్తున్నదనీ వాదిస్తున్నారు. చట్టాన్ని యధాతథంగా అమలుజరిపితే కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ మేలు జరుగుతుందన్న భ్రమలను ఆంధ్రప్రదేశ్ ప్రజలలో కల్పిస్తున్నారు. అలా జరిగితే తెలంగాణా ప్రజలకు నష్టమన్న భ్రమలను తెలంగాణా ప్రజలలో కల్పిస్తున్నారు. ఇరు రాష్ట ప్రజలమధ్యన వైమనస్యాలను ఎగద్రోసే పనిని ఇరువైపులా పాలకవర్గాలు సాగిస్తున్నాయి. ఇరు రాష్ట్రాలలోనూ ప్రజలెదుర్కొంటున్న సమస్యల నుండి దృష్టి మళ్లించే పనిలో నిమగ్న మయ్యాయి.

ఇరు రాష్ట్రాలలోని పాలక, ప్రతిపక్షాల ఈ పిల్లిమొగ్గలను ప్రక్కనబెడితే, అసలు సమస్య విభజన చట్టంలో అనేక లోపాలున్నాయని అందరూ అంగీకరించారు. ఈ లోపాలను అధిగమించేందుకు ఇరుపక్షాలు చర్చించుకుని ఒక పరిష్కారానికి రావచ్చు. ఆ పని ఎవ్వరూ చెయ్యరు. పరస్పర విరుద్ధప్రకటనలతో గందరగోళాన్ని సృష్టించి వైషమ్యాలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారు. వృత్తివిద్యా కళాశాలల్లో ప్రవేశాల సమస్యమీద లేవనెత్తిన వివాదం పాలకుల మోసపూరిత స్వభావాన్ని మరోసారి బహిర్గతపరచింది.

ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలనిచ్చే దాదాపు 20 పథకాలను గత కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తూవస్తున్నాయి. వీటిక్రింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజులు, హాస్టలు ఖర్చులను ప్రభుత్వాలు చెల్లిస్తూ వచ్చేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గతంలో దీనికి అదనంగా బిసి విద్యార్థులకు కూడా కొంతమేరకు ప్రభుత్వం అందిస్తూ వచ్చింది. రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ఈ నిధులన్నింటినీ కలిపి వృత్తివిద్యా కోర్సులలో ఫీజు రీయింబర్సుమెంటు పథకంగా కొత్తరూపం యిచ్చింది.

ప్రైవేటు ఇంజనీరింగు కళాశాలలకు అనుమతు లివ్వటంతో ఇంజనీరింగు కళాశాలలు తామరతంపరగా పుట్టుకొచ్చాయి. రాష్ట్రంలో 700లకు పైగా ఇంజనీరింగు కళాశాలలు వెలిశాయి. కనీస సౌకర్యాలూ, బోధనా సామాగ్రి, ల్యాబులు, బోధనా సిబ్బంది లేకుండానే ఇవి కొనసాగుతున్నాయి. ఇంజనీరింగు విద్య ఎంతనాసి స్థాయికి దిగజారిందంటే, దేశంలో ఇంజనీరింగు పట్టా పొందిన వారిలో 19 శాతం మంది మాత్రమే ఒక ఉద్యోగాన్ని పొందగల నైపుణ్యం సంతరించుకో గలిగారని ఒక అనధికార సర్వే తెలిపింది. ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా 13 లక్షల మంది ఇంజనీరింగు పట్టభద్రుల నుండి వివరాలు సేకరించిన సర్వే యిది. దీనిప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగం పొందే నైపుణ్యం పొందినవారు 12శాతంగానే వున్నారు. దీనితో ప్రైవేటు కాలేజీల్లో 3వ వంతు సీట్లు విద్యార్థులు చేరకుండా వుండిపోతున్నాయి. కొన్ని కాలేజీల్లో ఒక్క విద్యార్థి కూడా చేరని స్థితి ఏర్పడింది.

ప్రైవేటు కళాశాలలు డొనేషన్లు, అధికఫీజులు వసూలు చేస్తున్నాయన్న సాకుతో ఫీజులను నిర్ణయించే పని ప్రభుత్వం చేపట్టింది. రెండేళ్లకొకసారి ఫీజులు నిర్ణయించేందుకు కమిటీని నియమించింది. ప్రైవేటు కళాశాలలు సమర్పించిన ఖర్చులను పరిశీలించి ఎంత ఫీజు వసూలు చేయాలో ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈ ఖర్చుల లెక్కలను చూసినప్పుడు, ఫీజు రీయింబర్సు మెంటుకు ఇంతవరకూ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చుతో ప్రభుత్వమే ఇంజనీరింగు కాలేజీలను స్థాపించగలిగేది; అందరికీ ఉచిత నాణ్యమైన విద్యను అందించగలిగేదని స్పష్టమైంది. మరో మాటల్లో చెప్పాలంటే, ప్రైవేటు కళాశాలలకు నష్టాలు రాకుండా చూసేందుకే ప్రభుత్వం ఫీజు రీయింబర్సుమెంటు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆరోగ్యశ్రీ పథకంతో కార్పొరేటు ఆస్పత్రులకు నిధులు కట్టబెట్టి ప్రభుత్వ ఆసుపత్రులను కునారిల్ల చేసినట్లుగానే, ఫీజు రీయింబర్సుమెంటు పథకం ప్రైవేటు కళాశాలలను నష్టాలబారిన పడకుండా రక్షించింది.

ఈలోగా కేంద్ర ప్రభుత్వం కేంద్ర నిధులతో నిర్వహించబడుతున్న వివిధ సంక్షేమ పథకాల సంఖ్యను తగ్గించాలని ప్రతిపాదించింది. దానికోసం ఒక కమిటీని నియమించింది. మొత్తం 176 పథకాలనూ 66కు కుదించాలని కమిటీ సూచించింది. విద్యారంగానికి సంబంధించిన పథకాలు కూడా వీటిలో వున్నాయి.

ప్రాథమిక, మాధ్యమిక విద్యకు సంబంధించి మొత్తం 17 పథకాలుండగా (ఖర్చు 37 వేలకోట్లు) 6 పథకాలకు తగ్గించాలని సూచించింది. వీటికి పెట్టబోయే ఖర్చును పేర్కొనలేదుగానీ ప్రాథమిక, మాధ్యమిక విద్యకొరకు ఆదాయపు పన్నుపై విధిస్తున్న సర్‌ఛార్జీ మేరకు (దాదాపు 25వేల కోట్లు) పరిమితం చేయబోతున్నారు. అంటే పన్ను ఆదాయాన్ని కేటాయిస్తారు తప్ప బడ్జెట్టు నుండి అదనపు నిధులు యివ్వరు.

ఉన్నత విద్యకు 2 పథకాలుండగా ఒక పథకానికి తగ్గించాలని సూచించారు. అదికూడా పాలిటెక్నిక్ కాలేజీల నిర్మాణానికి ఖర్చు చేస్తారు.

ఆదివాసుల అభివృద్ధికి ఉన్న ఒక పథకాన్ని, ఆదివాసుల విద్యకున్న మూడు పథకాలను కలిపి ఒకే పథకంగా చేస్తారు. దీనికి గత ఏడాది కేటాయింపు 847 కోట్లు. తీవ్రవాదాన్ని అణచేపేరిట దీనిలో ఎక్కువ భాగాన్ని రోడ్లు, శాంతిభద్రతలకు కేటాయించి, విద్యకు కోతపెడతారన్నది స్పష్టమే.

సామాజిక న్యాయం క్రింద ఉన్న 13 పథకాలను 5 పథకాలుగా తగ్గిస్తారు. దీనిలో ఎస్సీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లకున్న 6 పథకాలనూ ఒక పథకంగానూ, బిసిలకున్న 3 పథకాలనూ ఒక పథకంగానూ తగ్గించారు. ఇక మైనారిటీలకు 4 పథకాలున్నాయి. వీటిలో 3 పథకాలు విద్యకు సంబంధించినవే. వీటిని ఒకే పథకం చేశారు. గత ఏడాది దీనికి కేటాయింపు 2409 కోట్లు. కుదించిన తర్వాత కేటాయింపులెంతో చెప్పలేదు.

ముఖ్యమంత్రుల సమావేశాల్లో ముఖ్యమంత్రు లందరూ కేంద్ర ప్రభుత్వ పథకాల సంఖ్యను కుదించాలని కోరటంతోపాటు, రాష్ట్రాల వాటాగా యివ్వవలసిన నిధులను భరించలేము గనుక కేంద్రమే భరించాలని కూడా అడిగారు. అంటే కేంద్రం కేటాయింపు మేరకే ఖర్చు చేస్తామని రాష్ట్రాలు చెప్పాయి.

ఈ నేపథ్యంలోనే ఫీజు రీయింబర్సుమెంటుకు నిధులను తగ్గించే పనిని ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. కళాశాలలను అవి ఏర్పాటుచేసిన సౌకర్యాల ప్రాతిపదిక వర్గీకరించి 60వేల నుండి లక్షరూపాయల వరకూ ఫీజుగా నిర్ణయించింది. తానుమాత్రం 30వేల రూ॥లు మాత్రమే చెల్లిస్తాననీ మిగిలినది విద్యార్థులే భరించాలనీ ప్రకటించింది.

ఇప్పటివరకూ ఈ పథకం ద్వారా ప్రైవేటు కాలేజీలకు లాభాలు వచ్చేలా చేశారు. ఇప్పుడు ఈ పథకానికి ఖర్చును క్రమంగా తగ్గించే పనిలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ పడ్డాయి.

తెలంగాణా ప్రభుత్వం ఫీజురీయింబర్సుమెంటు పథకాన్ని రద్దుచేసినట్లు ప్రకటించింది. దాని స్థానంలో తెలంగాణా విద్యార్థులకు ఆర్థిక సాయం అన్న పథకాన్ని ప్రకటించింది. 1956 నాటికి (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటికి) తెలంగాణా వాసులుగా వున్నవారి పిల్లలకే ఈ పథకం వర్తిస్తుందని చెప్పింది. దీనితో ఇప్పటికే ఫీజు రీయింబర్సుమెంటు పొందుతున్న విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరమైంది. కొత్తగా చేరాల్సిన విద్యార్థులు ఎక్కడ చేరాలో తెలియని స్థితిలో పడ్డారు.

ఇక ఆంధ్రప్రదేశ్‌లోకి టిడిపి ప్రభుత్వం ఫీజు రీయింబర్సుమెంటు పట్ల తన వైఖరేమిటో చెప్పకుండా టిఆర్ఎస్ మీద విరుచుకుపడటం సాగిస్తున్నది. తెలంగాణాలో చదువుకున్న ఆంధ్ర విద్యార్థులకు అన్యాయం చేస్తున్నాడంటూ కేసీఆర్‌పై దుమ్మెత్తి పోస్తున్నది. విభజన చట్టం ప్రకారం కాలేజీల్లో ప్రవేశాల హక్కు తనకి వుందంటూ వివాదం రేపింది. దీనికి ప్రతిగా తెలంగాణ ఉన్నత విద్యాకౌన్సిల్‌ను ఏర్పరచి కేసిఆర్ తెలంగాణలో ప్రవేశాలు తామే చేసుకుంటా మంటూ ఆజ్యం పోశాడు. చివరకు సుప్రీంకోర్టుకు చేరారు.

విభజన చట్టం ప్రకారం ప్రవేశాలు జరపమని సుప్రీంకోర్టు చెప్పడంతో ఇరువురూ కలిసి ప్రవేశాలు జరిపేందుకు పూనుకున్నారు. ఫీజు రీయింబర్సుమెంటు సమస్యను మాత్రం కోర్టూ తేల్చలేదు. ప్రవేశాలు జరిపే రెండు ప్రభుత్వాలూ అంతిమంగా వైఖరి చెప్పలేదు. ఈ వివాదం ఇక ముందు కూడా కొనసాగిస్తారు.

విభజన చట్టంలో ఏమున్నా, ఇరువురూ కలిసే ప్రవేశాలు జరపాలన్న నిర్ణయానికి కోర్టు తీర్పు వచ్చిన 24 గంటల్లో రాగలిగారంటే, ఫీజు రీయింబర్సుమెంటు పైన కూడా చర్చించుకుని ఒక ఒప్పందానికి రావటం అసాధ్యంకాదని తెలుపుతున్నది. కానీ ఆ ప్రయత్నాన్ని యిరుపక్షాలూ చెయ్యవు. అలా చెయ్యకపోవటంలో ఇరుపక్షాలదీ ఒకటే లక్ష్యం. ఒక క్రమంలో ఫీజు రీయింబర్సుమెంటు పథకాన్ని క్రమంగా తగ్గించి వేయటం. దీనికి తెలంగాణా చెప్పే సాకు ఇంజనీరింగు కాలేజీలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి గనుక వాటిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు సమయం కావాలని, టిడిపి ప్రభుత్వం అలాంటి సాకు కూడా చూపకుండా, విభజన చట్టాన్ని చూపి ఫీజు రీయింబర్సుమెంటును చెరిసగం భరిద్దామంటూ ప్రతిపాదనలు చేస్తున్నాయి.

ప్రాంతీయ వైమనస్యాలను పెంచి విద్యార్థుల చదువులతో ఇరు రాష్ట్రాలలోని పాలకవర్గాలూ చెలగాటమాడుతున్నాయి. విద్యార్థుల కాలేజీ ప్రవేశాలు ఆలస్యమైతే, తక్షణ సమస్యతోపాటుగా, ఈ విధానం దీర్ఘకాలిక నష్టాలను కూడా కల్గిస్తుంది.

ప్రైవేటు కాలేజీలకు లబ్ధి చేకూర్చే ప్రభుత్వ విధానాలతో చదువంటే ఇంజనీరింగు విద్యగా చిత్రిస్తున్నారు. నాణ్యతలేని విద్యకు లోబర్చి పట్టాకాగితాలు చేతిలో పెడుతున్నారు. ఇది ఉపాధి కల్పించటం లేదంటూ ఇంజనీరింగు విద్యను సాంకేతిక నిపుణత స్థాయికి కుదిస్తున్నారు. దీనితో మౌలిక ఇంజనీరింగు విజ్ఞానం గల నిపుణుల తయారీ మూలన పడుతున్నది.

మరోవైపున, మౌలిక శాస్త్రాల, సామాజిక శాస్త్రాల విద్య పూర్తి నిరాదరణకు గురౌతున్నది. దీనితో శాస్త్ర విజ్ఞానం దేశీయంగా అభివృద్ధి చెందటం ఆగిపోతుంది. దేశీయ శాస్త్రవిజ్ఞానం కొరకు విదేశాలవైపు ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

ఈ స్థితిలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాలకులు సాగిస్తున్న మోసాన్ని అర్థంచేసుకోవాలి. ఫీజు రీయింబర్సుమెంటు పథకాన్ని అమలుజరిపేందుకు రెండు రాష్ట్రాలు ఒక అవగాహనకు వచ్చి అమలు చేయాలని కోరాలి.

దానితోపాటు ఉన్నతవిద్యను ప్రభుత్వరంగంలోనే వుంచాలని డిమాండుచేయాలి. దీనికి నిధులు లేవని చెప్పటం అబద్ధప్రచారమని ఫీజురీయింబర్సుమెంటుకు పెడుతున్న ఖర్చే తెలుపుతున్నది.

అప్పుడు మాత్రమే దేశానికీ, ప్రజలకు అవసరమైన, నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుంది. ఆ విద్య ప్రజల జీవితాలలో మెరుగుదలకు తోడ్పడుతుంది. అలాంటి విద్యావిధానం రూపొందించాలని డిమాండు చేయాలి.

ఈ డిమాండ్లతో సంఘటిత ఉద్యమాన్ని నిర్మించేందుకు ప్రజాస్వామికశక్తులూ, సంస్థలు, విప్లవకారులు పూనుకోవాలి. ✡

# పోరాడి విజయం సాధించిన నారాయణి స్టీల్ కార్మికులు

**విజయనగరం, 19-7-14 :**

విజయనగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గల నారాయణి స్టీల్(ప్రై)లిమిటెడ్‌లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతీ 3 సం॥లకు వేతన ఒప్పందం జరుగుతున్నది. 1-4-2014 నుండి నూతన వేతన ఒప్పందం జరగాల్సి ఉంది. యూనియన్ డిమాండ్ నోటీసు యిచ్చినా యాజమాన్యం ఖాతరు చేయలేదు. సమ్మె చేస్తే పోలీసుల బందోబస్తుతో మిల్లు నడుపుతామని, అడ్డుకుంటే జైలుకు పంపిస్తామని సవాల్ చేసింది.

సమస్యల పరిష్కారానికి అన్ని వైపులా చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో, జూన్ 14 నుండి కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధంగా ఉన్న నారాయణి స్టీల్ వర్కర్స్ యూనియన్ సమ్మెకు నాయకత్వం వహించింది.

కంపెనీలో తయారైన 10 లారీల ఇనుప ఊచలను తరలించడానికి యాజమాన్యం చేసిన ప్రయత్నాలను కార్మికులు అడ్డుకున్నారు. లోడ్ అయిన 3 లారీలను బయటకు వెళ్లనివ్వలేదు.

సమ్మె సందర్భంగా 14-6-2014 తేదీన ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో కార్మికులు మిల్లు గేటుముందు ధర్నా చేశారు. యాజమాన్యం దోపిడీ విధానాలను నిరసిస్తూ పెద్దపెట్టున నినదించారు. ధర్నాలో సంఘీభావంగా రజక సమాఖ్య సభ్యులు, అల్యూమినియం కార్మికులు, అరుణా జూట్ నుండి ముఖ్యులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. బొబ్బిలి నుండి ప్రజాకళాకారులు ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ ఎమ్. గోపాలం ధర్నాలో సంఘీభావంగా పాల్గొన్నారు. పోలీసు బందోబస్తుతో ఇతర రాష్ట్రాల వారితో మిల్లు నడిపించడానికి; తయారైన సరుకు తరలించుకుపోవడానికి యాజమాన్యం చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో కార్మికశాఖాధికారుల వద్ద వేతన ఒప్పందం చేయడానికి యాజమాన్యం వ్రాతమూలకంగా అంగీకరించింది. కార్మికులు 12-7-2014న సమ్మె విరమించారు. 19-7-2014 తేదీన డిప్యూటీ లేబరు కమీషనరు సమక్షంలో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. 1-4-2014 నుండి 3 సం॥ల కాలం వేతన ఒప్పందానికి యాజమాన్యం అంగీకరించింది.

నారాయణి స్టీల్ కార్మికుల సమ్మె ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో నెలరోజులపాటు నడిచిన తీరు ఈ ప్రాంతంలో మిగతా కార్మికులపై మంచి ప్రభావం పడవేసింది. ఎర్రజెండాలతో, డిమాండ్ల ప్లకార్డులతో రేయింబవళ్ళు సరుకు బయటకుపోకుండా, ఇతర రాష్ట్రాల కార్మికులతో మిల్లు నడవకుండా కాపలా కాయటం, మహిళా కార్మికులు కూడా పగలంతా పురుష కార్మికులతో సమానంగా నిలబడటం కూడా ప్రభావితం చేసింది. ✡

# ఆందోళన ద్వారా విధుల్లోకి రైల్వే కాంట్రాక్టు కార్మికులు

**మచిలీపట్నం, 9-6-14 :**

మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన 55 మంది రైల్వే కోచ్ క్లీనింగ్ వర్కర్స్ పనిచేస్తున్నారు. వారి కాంట్రాక్టు కాలపరిమితి 3 సం॥లు ముగియటంతో, కొత్త కాంట్రాక్టరు, రైల్వే ఉన్నతాధికారుల మధ్య జరిగిన ఒప్పందం మేరకు ఇప్పటివరకు పనిచేసిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకొనేందుకు యాంత్రీకరణ, కనీస విద్యార్హత అనే నిబంధనలను అడ్డం పెట్టుకొని నిరాకరించారు. ఎలాంటి రిమార్కులు, ఫిర్యాదులు లేని ఈ కార్మికులను కోచ్‌లలో ప్రవేశపెట్టే క్లీనింగ్ యంత్రాలను వినియోగించేందుకు తగిన శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకోవాలని, నూతనంగా వచ్చిన కాంట్రాక్టరును, రైల్వే ఉన్నతాధికారులను కల్సి విన్నవించారు. అయినప్పటికీ వారు నిరాకరించటంతో ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ అభ్యుదయ రైల్వే కోచ్ క్లీనింగ్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ఎదుట జూన్ 9, 10 తేదీల్లో రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని నిర్వహించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని మాట్లాడుతూ 5 లక్షల మందికి ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని ఒక ప్రక్క ప్రకటనలలో పాలకులు ఊదరగొడ్తున్నారని, వాస్తవంలో 3 సం॥లు పనిచేసిన కాంట్రాక్టు క్లీనింగ్ కార్మికులను నిర్దాక్షిణ్యంగా తిరిగి విధుల్లోకి తీసుకోకుండా వీధుల్లోకి నెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణమే కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకొని పునర్నియామకం చేయాలని డిమాండు చేశారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) బందరు ఏరియా నాయకులు, వివిధ ప్రజాసంఘాలనాయకులు నిరాహార దీక్షాశిబిరంలో పాల్గొని సంఘీభావం తెల్పారు.

ఆందోళన అనంతరం మొత్తం కార్మికుల్లో 25 మందిని తిరిగి విధుల్లోకి తీసుకొన్నారు. మిగిలిన 35 మందిని ఆ తర్వాత పనిలోకి తీసుకొంటామని నూతన కాంట్రాక్టరు హామీ ఇచ్చారు. ఆందోళన ద్వారా రైల్వే కోచ్ కాంట్రాక్టు క్లీనింగ్ వర్కర్స్ పాక్షిక విజయం సాధించారు. మిగిలిన కాంట్రాక్టు కార్మికుల్ని విధుల్లోకి తీసుకోని పక్షంలో తిరిగి ఆందోళన చేస్తామని ప్రకటించారు. ఆందోళనకు ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ ముచ్చు సుధాకరరావు, యూనియన్ నాయకులు కా॥ మట్టా కిశోర్‌బాబు, కా॥ టి. లక్ష్మయ్య, పవన్‌కుమార్ నాయకత్వం వహించారు. ✡


Read ! Subscribe!!




Hindi Organ of Central Committee of CPI (ML)

# పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసన

**మంగళగిరి, 20-7-14 :**

అమెరికా సామ్రాజ్యవాదుల దన్నుతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న సైనిక దాడులను నిరసిస్తూ స్థానిక పిడిఎస్ఓ, ఎన్వైయస్‌ల ఆధ్వర్యంలో కుప్పరావు కాలనీ సెంటర్ నుండి మిద్దె సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మిద్దెసెంటర్‌లో సామ్రాజ్యవాద రక్తపిశాచి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా ఎన్వైయస్ జిల్లా నాయకులు కా॥ వి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వేలాదిమంది పాలస్తీనీయులను హతమార్చుతున్న ఇజ్రాయిల్ చర్యలను ఐక్యరాజ్యసమితి ఖండించకపోవటాన్ని తీవ్రంగా నిరసించారు. పిడిఎస్ఓ పట్టణ అధ్యక్షులు కా॥ నాగూర్ బాబా మాట్లాడుతూ భారత పాలకుల సామ్రాజ్యవాద లొంగుబాటు వైఖరిని ఖండించారు. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలలో విద్యార్థి యువజనులంతా కదలి రావాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ జిల్లా నాయకులు కామ్రేడ్స్ కె.వి.రమణ, నాగ బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

**చోడవరం, 18-7-14 :**

విశాఖజిల్లా చోడవరంలోని గురజాడ స్టడీ సర్కిల్ కార్యాలయంలో పిడిఎస్ఓ ఆధ్వర్యంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ కా॥ ఏ. సురేష్ అధ్యక్షతన సభ నిర్వహించారు.

ఈ సభలో ఓపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥ పి. కోటిరెడ్డి మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు వునికిలో లేని ఇజ్రాయిల్‌ను అరబ్ దేశాలపై తమ ఆధిపత్యం కొరకు అమెరికా - బ్రిటీష సామ్రాజ్యవాదులు సృష్టించారని, దానిని సాధనంగా ఉపయోగిస్తూ తమ ఆర్థిక సైనిక ప్రయోజనాన్ని నెరవేర్చుకుంటున్నారన్నారు. ఓపిడిఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. గౌరీశంకర్, జనసాహితి జిల్లా నాయకులు రామకృష్ణ, నూకాచారి, ఎన్వైయస్ జిల్లా కన్వీనర్ సతీష్ తదితరులు ఈ సభలో పాల్గొని ప్రసంగించారు.

**గుంటూరు, 31-7-14 :**

పాలస్తీనా ప్రజలపై వైమానిక దాడులకు పాల్పడుతూ మారణకాండను సాగిస్తున్న ఇజ్రాయిల్‌ను, దానికి దన్నుగా వుండి నడిపిస్తున్న అమెరికా సామ్రాజ్య వాదాన్ని భారత ప్రజలందరూ వ్యతిరేకించాలని, దాడులని ఇజ్రాయిల్ బేషరతుగా నిలిపివేయాలని కోరుతూ నవయువ సమాఖ్య, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థల ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో లాడ్జి సెంటర్ నుండి శంకర్ విలాస్ సెంటరు వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సామ్రాజ్యవాద యుద్ధపిపాస అమెరికా - ఇజ్రాయెల్‌ల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ ప్రదర్శనలో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులను ఖండించారు. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, ఐక్యరాజ్య సమితి మౌనం దాల్చటం వెనుకవున్న అమెరికా పెత్తనాన్ని వ్యతిరేకించండి అని నినదించారు.

ఈ కార్యక్రమంలో ఎన్వైయస్ జిల్లా కార్యదర్శి కా॥ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రపంచ పోలీసు, పెద్దన్నగా వ్యవహరిస్తున్న అమెరికా ప్రోద్బలంతో దొంగసాకులను చూపుతూ ఇజ్రాయెల్ పాలస్తీనియా ప్రజలపై దాడులకు తెగబడడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొంటూ తీవ్రంగా నిరసించారు. ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండించ వలసిందిగా భారత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు.

పిడిఎస్ఓ జిల్లా నాయకులు కా॥ గురులింగం మాట్లాడుతూ ప్రపంచశాంతిని నెలకొల్పాల్సిన ఐక్యరాజ్యసమితి ఇజ్రాయిల్‌ని నిలువరించలేకపోవటం వెనుక అమెరికా సామ్రాజ్యవాద హస్తాన్ని గుర్తించాలని, ఇలాంటి దాడులు ఏ దేశంపై కూడా జరగకూడదని, ప్రపంచ దేశాలన్నీ ఇజ్రాయిల్‌ని కట్టడి చేయాలని లేనట్లయితే ఇలాంటి సామ్రాజ్యవాద దురాక్రమణ దాడులకు రేపు భారతదేశం కూడా గురికాక తప్పదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎన్వైయస్ నాయకులు సుబ్బారావు, నరేంద్ర; పిడిఎస్ఓ నాయకులు హనుమంతు, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఎన్వైయస్ - పిడిఎస్ఓ కార్యక్రమాన్ని పోలీసువారు అడ్డుకోవడాన్ని, నాయకుల్ని పోలీసులు అదుపులోకి తీసుకోవటాన్ని ఎన్వైయస్-పిడిఎస్ఓ జిల్లా కమిటి ఖండించింది. ✱

# 'చుండూరు మారణకాండ - హైకోర్టు తీర్పు'పై సభ

**ఏఎన్‌యు, 15-7-14 :**

పిడిఎస్ఓ, ఎన్వైఎస్‌ల ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్టూడెంట్ సెంటర్‌లో 'చుండూరు మారణకాండ - హైకోర్టు తీర్పు'పై సభను నిర్వహించారు. ఈ సభకు పిడిఎస్ఓ జిల్లా అధ్యక్షులు కా॥ బి. నాగబసవయ్య, ఎన్వైయస్ జిల్లా కార్యదర్శి కా॥ కె. లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. చుండూరు మారణకాండలో మృతులకు సంతాపసూచకంగా తొలుత సభికులంతా 2 ని॥ల మౌనం పాటించారు.

ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. హనుమంత రావుగారు ఈ సభలో మాట్లాడుతూ చుండూరు మారణకాండపై హైకోర్టు ఏకపక్ష తీర్పును తప్పు పట్టారు. చట్టాలు, న్యాయవ్యవస్థ, ప్రభుత్వ అధికార యంత్రాంగమంతా అగ్రకుల, భూస్వామ్యపక్షమేనని మరోసారి తేటతెల్లమయిందన్నారు. దళితులపై ఈనాటికీ సాగుతున్న అగ్రకుల దురహంకారదాడులు, హత్యాకాండను తిప్పికొట్టడానికి వారంతా సంఘటితపడి పోరాడటం తారి ప్రజాస్వామిక హక్కుగా పేర్కొంటూ చుండూరు దళితుల న్యాయపోరాటానికి విద్యార్థి, యువజనులు, ప్రజాతంత్ర మేధావులంతా సంఘీభావంగా నిలవాలన్నారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కామర్స్ విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషాగారు మాట్లాడుతూ దళితులపై దాడులలో చుండూరు ఘటన మొదటిదికాదనీ, చివరిదీకాదని చెపుతూ, ఈనాటికీ దేశవ్యాపితంగా దళితులపై సాగుతున్న దాడులను ఉదహరించారు. ఇప్పటికీ గ్రామాలలో అంటరానితనం, రెండు గ్లాసుల విధానం, వెట్టిచాకిరీ కొనసాగుతోందని వీటికి వ్యతిరేకంగా సంఘటితమయ్యే దళితులకు, వారి ఉద్యమాలకు మద్దతుగా నిలవాలని, ప్రగతిశీల భావాలను పెంపొందించుకునే కర్తవ్యాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ ఎస్కె బాజీసైదా మాట్లాడుతూ క్రిందికోర్టు విధించిన శిక్షలను సైతం రద్దుచేస్తూ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు - దళితులపై అనునిత్యం దాడులకు పాల్పడుతున్న అగ్రకుల, భూస్వామ్యవర్గాలకు మరింత ఊతమిచ్చేదిగా వున్నదన్నారు. న్యాయవ్యవస్థ స్వభావాన్ని అర్థం చేసుకోవటంతోపాటుగా, ఇలాంటి తీర్పులను నిరసిస్తూ బాధిత ప్రజానీకం సాగించే పోరాటాలకు అన్నివిధాలా అండదండగా వుండాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంకా పిడిఎస్ఓ నాయకులు కె.వి. రమణ, బి. వెన్నెల, అనిత, విజయభాస్కర్; ఎన్వైయస్ నాయకులు కె. శ్రీను, దుర్గాప్రసాద్, రాజేశ్వరి, తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. 250 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ సభకు హాజరయ్యారు. ✱

# ధరల పెరుగుదలను నిరసిస్తూ ధర్నా

**విజయనగరం, 29-7-2014 :**

ఎన్‌డిఏ ప్రభుత్వ ప్రజావ్యతిరేక సామ్రాజ్యవాద అనుకూల దోపిడీ విధానాలను వ్యతిరేకిస్తూ 29-7-14 తేదీన విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ కార్మిక సంఘాలైన - జిల్లా ఆటోవర్కర్స్ యూనియన్, జిల్లా రజకసమాఖ్య, నారాయణి స్టీల్ వర్కర్స్ యూనియన్, అల్యూమినియం స్పిన్నింగ్&రోలింగ్ వర్కర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.

ఈ ధర్నాలో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని; పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కిరోసిన్ ధరలను నియంత్రించాలని రక్షణ, ఎల్‌ఐసీ, రైల్వేల్లో విదేశీ ప్రత్యక్షపెట్టుబడులను వ్యతిరేకిస్తూ ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణను నిరసిస్తూ కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ధర్నానుద్దేశించి మాట్లాడిన ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు బి. శంకరరావు, రెడ్డి నారాయణరావులు సామ్రాజ్యవాదులు, బడా కార్పొరేట్ కంపెనీల కొమ్ముకాస్తున్న దోపిడీ విధానాలను సంఘటిత శక్తితో ప్రతిఘటించాల్సిన అవసరం వుందని అన్నారు. ఇంకా ఈ ధర్నాలో ఆటో యూనియన్ నాయకులు ఎన్. అప్పలరాజురెడ్డి, బి. పాపారావు; రజక సమాఖ్య నాయకులు జి.సత్యారావు, ఎమ్. పైడిరాజు, నారాయణి స్టీల్ వర్కర్స్ యూనియన్ తరుపున బి. సింహాచలం ఎన్వైయస్ జిల్లా అధ్యక్షులు ఎమ్. అప్పలరాజు, అరుణా జూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి. శ్రీను మాట్లాడారు. ✱

**విప్లవపంథా అమలు ... (8వ పేజీ నుండి)**

ప్రజాయుద్ధ పంథాను సిద్ధాంతీకరించి, ఆచరించడంలో నాయకత్వ పాత్రను, ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్ని వివరించారు.

వ్యవసాయార్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె. ఆర్. చౌదరి ప్రసంగిస్తూ విద్యార్థి దశ నుండీ తనపై నాగిరెడ్డి గారి భావజాలం, వ్యక్తిత్వ ప్రభావాలను తెలియపరిచారు. గొప్ప మార్క్సిస్టు లెనినిస్టు మేధావిగా, పీడిత ప్రజల మహానాయకునిగా, ఆయన త్యాగపూరిత, సాహసోపేత జీవితాన్ని వివరించారు. నేటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పరిస్థితులలో 'తాకట్టులో భారతదేశం' లోని విశ్లేషణ మరింత విలువను సంతరించుకున్నదని ఆయన అన్నారు.

తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ప్రచురించిన "సోవియట్ యూనియన్‌లో స్త్రీల పరిస్థితి" పుస్తకాన్ని డా॥ సూర్యసాగర్ ఆవిష్కరించి పరిచయం చేశారు. 30 ఏళ్ళ క్రితం రచించిన ఈ పుస్తకం బోల్షివిక్ రష్యా విప్లవం స్త్రీల పరిస్థితిలో తెచ్చిన గొప్ప అభివృద్ధికర మార్పును వివరిస్తుందని, స్త్రీవిముక్తికి సోషలిజం మాత్రమే పరిష్కారమని అన్నారు. సింగమనేని నారాయణ ప్రసంగిస్తూ భూస్వామ్య కుటుంబంలో జన్మించినా శ్రామికుల పక్షాన నిలిచి పోరాడిన మహోన్నత వ్యక్తి నాగిరెడ్డిగారు అన్నారు. అతివాద దుస్సాహసికవాదానికి వ్యతిరేకంగా ఆయన నిబ్బరంగా పోరాడారు అన్నారు. కరువుపీడిత అనంతపురం జిల్లాకు సాగునీటి సాధనకై నాగిరెడ్డిగారు చూపిన మార్గంలో ఉద్యమించాలని చెప్పారు. కా॥ తిమ్మారెడ్డి విప్లవోద్యమంలో కా॥ నాగిరెడ్డి నిర్వహించిన అద్వితీయ పాత్రను గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజా విప్లవ విజయానికి ఆయన చూపిన బాటే శరణ్యం అన్నారు. కా॥ సి.ఆర్. ఖాన్, కా॥ చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ కా॥ టి.ఎన్‌కు నివాళులర్పించారు. బాల కళాకారులు 'అడవితల్లికి దండాలు' పాటకు చక్కటి నృత్య ప్రదర్శన చేశారు. ✱

# 'సోవియట్ యూనియన్‌లో స్త్రీల పరిస్థితి' పుస్తకావిష్కరణ సభ

**హైదరాబాద్, 28-7-14 :**

'సోవియట్ యూనియన్‌లో స్త్రీల పరిస్థితి' పుస్తకావిష్కరణ సభ 28-7-14న హైదరాబాద్, సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగింది. సభకు జీపిఎల్ నరసింహారావు అధ్యక్షత వహించారు. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 38వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ సభను ఏర్పాటుచేశామని చెపుతూ కా॥ టిఎన్‌కు విప్లవజోహార్లర్పించారు. నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు నిరంతరాయంగా వెలువరిస్తున్న ప్రచురణలలో 'సోవియట్ యూనియన్‌లో స్త్రీల పరిస్థితి' పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించుకుంటున్నామని తెలిపారు. ఈ పుస్తకాన్ని పరిశోధకురాలు డాక్టర్ వకుళాభరణం లలిత ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఏ సమాజమైనా అభివృద్ధి చెందాలంటే ఆ సమాజంలోని స్త్రీల స్థితిగతుల్లో సమూల మార్పు రావాలన్నారు. స్త్రీల అభ్యున్నతి కోసం ఆనాటి సోషలిస్టు రష్యా సాగించిన కృషి ఫలితంగా స్త్రీల జీవితాల్లో ఎంత గొప్పగా మార్పు వచ్చిందో ఈ పుస్తకం తెలియ చేస్తుందన్నారు. స్త్రీలను ఇంటిచాకిరి, పిల్లల పెంపకం నుంచి బయటపడ వేయడానికి (క్రెచ్‌లు, కిండర్ గార్డెన్లు, సామూహిక వంటశాలల ఏర్పాటు) వారి శక్తి సామర్థ్యాలు వెలికితీయడానికి ఆనాటి సోషలిస్టు ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో కృషి సాగించిందన్నారు.

ఈ సభకు వక్తగా వచ్చిన కాత్యాయని (రచయిత్రి) మాట్లాడుతూ సమాజంలో విప్లవాత్మక మార్పులతోనే స్త్రీల విముక్తి అన్న అంశం ముడిపడివుందన్న వాస్తవాన్ని ఈ పుస్తకం తెలియచేస్తుందన్నారు. సోవియట్ సోషలిస్టు ప్రభుత్వానికి స్త్రీల విముక్తిపట్ల ఒక స్పష్టమైన దృక్పథం వుండబట్టే మహిళల అభివృద్ధి కోసం అనేక చట్టాల్ని, ప్రత్యేక సదుపాయాల్ని, అవకాశాల్ని అందించిందన్నారు. మహిళలకి ఆనాడు కల్పించిన హక్కులు - అవి అమలయిన తీరుని పోల్చుకుంటే ఈనాటికీ చాలా దేశాల్లో అమలుకావడంలేదన్నారు. సమాజ విముక్తితోనే స్త్రీల విముక్తి సాధ్యమవుతుందన్న విషయాన్ని బలంగా చెప్పిన ఈ పుస్తకాన్ని అధ్యయనం చెయ్యాలన్నారు.

ఈ పుస్తక అనువాదకులు తోలేటి జగన్మోహనరావు మాట్లాడుతూ - తాను ఈ పుస్తకాన్ని అనువదించడానికి గల కారణాలను వివరించారు. మార్క్సిస్టు, లెనినిస్టు తాత్విక సిద్ధాంతం వెలుగులో విప్లవాన్ని విజయవంతం చేసుకొన్న రష్యా, సోషలిస్టు వ్యవస్థను ముందుకు తీసుకెళ్తున్న క్రమంలో స్త్రీల విముక్తి కోసం సాగించిన కృషిని ఈ పుస్తకంలో రచయిత సెరిబ్రెన్నికోవ్ గణాంకాలతోసహా వివరించా రన్నారు. గత సమాజంలో దుర్భర దారిద్ర్యాన్ని, అణచివేతని అనుభవించిన రష్యాలోని వివిధ జాతుల స్త్రీల జీవితాల్లో వచ్చిన గుణాత్మక మార్పుని ఈ పుస్తకంలో రచయిత పొందుపరిచారన్నారు.

ఈ సభలో స్త్రీ విముక్తి సంఘటన ప్రధాన కార్యదర్శి యం. లక్ష్మి మాట్లాడుతూ నిరంకుశ జార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, అన్ని రకాలైన దోపిడీ, పీడన, అణచివేత, అసమానతలకు వ్యతిరేకంగా మార్క్సిస్టు, లెనినిస్టు తాత్విక అవగాహనతో సాగిన రష్యన్ విప్లవం విజయవంతమైందన్నారు. విప్లవం విజయవంతమైన తర్వాత ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం స్త్రీల విముక్తి కోసం సాగించిన నిర్దిష్ట, ఆచరణాత్మక కృషి ఈ పుస్తకంలో కనిపిస్తుందన్నారు. స్త్రీల సమస్యలకు వ్యక్తిగత స్థాయిలో పరిష్కారంలేదని, వ్యవస్థ మార్పుతోనే స్త్రీల విముక్తికి పునాది పడుతుందన్నారు.

వక్తల ప్రసంగాల అనంతరం జరిగిన చర్చలో పాల్గొన్న చరిత్ర పరిశోధకులు, ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ మాట్లాడుతూ - సోషలిజం అన్న భావన మీద ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న దాడి మనందరికీ తెలుసుననీ, ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సోషలిస్టు వ్యవస్థ పట్ల అపారమైన విశ్వాసంతో ఈ పుస్తకాన్ని ప్రచురించిన టి.ఎన్. ట్రస్టును అభినందించడానికే ఇక్కడికి వచ్చానన్నారు. ఈ చర్చలో పాల్గొన్న రచయిత భూపాల్ మాట్లాడుతూ - స్త్రీ పురుష వివక్ష, అసమానతలు ప్రతి చోటా వ్యక్తమవుతున్న పరిస్థితుల్లో ఇలాంటి పుస్తకాలు రావలసిన అవసరం ఎంతో వుందన్నారు. ✱

# చుండూరు కేసులో హైకోర్టు తీర్పుకు నిరసన



ఒంగోలులో ప్రదర్శన

**ఒంగోలు, 6-8-14 :**

చుండూరు దళితులపై జరిగిన మారణకాండ కేసులో హైకోర్టు తీర్పును ఖండిస్తూ, హత్యాకాండకు కారకులైన దోషులను శిక్షించాలని ఒంగోలులో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.), ఏఐఎఫ్‌టియు(న్యూ) సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఈమనిపాలెం సెంటరు నుండి ప్రకాశం భవనం మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి, అనంతరం ధర్నా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ఎమ్.ఎస్.సాయి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన చుండూరు సంఘటన నేపధ్యాన్ని వివరిస్తూ, న్యాయపోరాటాలతో మాత్రమే దళితులకు న్యాయం దక్కదని పదే పదే స్పష్టమౌతుందని, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, బలహీన వర్గాలవారు, పీడిత ప్రజలందరూ సంఘటితపడి ఐక్యంగా పోరాడితేనే తమను తాము రక్షించుకో గలుగుతారనిఅన్నారు. అనంతరం ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ కత్తి పేరయ్య మాట్లాడుతూ ఈ దేశంలో దళితులు, అణగారిన ప్రజల సమస్యలు పరిష్కరింపబడాలంటే భూమి సమస్య, సంపదలలోని వాటా సమస్య పరిష్కరింపబడాలన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ ఎస్.లలిత కుమారి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఈ 68 సం॥లలో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలపై అగ్రకుల భూస్వామ్య వర్గాలు, పెత్తందారీ శక్తులు దాడులు నిర్వహిస్తూనే వున్నారని, ఏ ఒక్క కేసులోనూ దోషులు అంతిమంగా శిక్షింపబడలేదని, మొత్తం న్యాయవ్యవస్థ, రాజ్యం భూస్వామ్య, అగ్రకుల, సంపన్న వర్గాల కొమ్ముకాస్తున్నాయని, దున్నేవానికే భూమి నినాదంతో భూస్వాముల ఆధీనంలోని భూము లన్నింటిని దళితులు, భూమిలేని నిరుపేదలు ఐక్య పోరాటాల ద్వారా సాధించుకోవడమే అంతిమ పరిష్కారమన్నారు.

ఈ ధర్నా శిబిరంలో ఓపిడిఆర్ జిల్లా అధ్యక్షులు కా॥ ఎమ్.వి. క్రిష్టయ్య, సాహిత్యవేదిక నాయకులు కా॥ ఏసుదాసు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ వి. రామారావు, ఉపాధ్యక్షులు కా॥ పి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ✱

# సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కమిటి పిలుపు మేరకు ఎన్‌డిఏ ప్రభుత్వ కేంద్ర బడ్జెట్టును నిరసిస్తూ ప్రదర్శన



కేంద్రబడ్జెట్టును వ్యతిరేకిస్తూ గుంటూరులో ప్రదర్శన

**గుంటూరు, 28-7-14 :**

'నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వ బడ్జెట్టు మోసాన్ని నిరసించండి' అని సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కమిటి ఇచ్చిన పిలుపుమేరకు పార్టీ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో గుంటూరులో 28-7-14న ప్రదర్శన జరిగింది.

స్థానిక రైల్వేస్టేషన్ నుండి ప్రారంభమైన ఈ ప్రదర్శన శంకర్‌విలాస్, కలెక్టరేట్, కోర్టు మీదుగా తిరిగి రైల్వేస్టేషన్ వరకు సాగింది. ప్రదర్శనను ప్రారంభిస్తూ సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్ మాట్లాడారు. జులై 28న కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 38వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు విప్లవ జోహార్లర్పించారు. మంచిరోజులు రానున్నాయని ఎన్నికల సమయంలో నినాదమిచ్చిన మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైల్వే, కేంద్ర బడ్జెట్టులలో ధనికులకు అనుకూలంగా, సామాన్యులకు వ్యతిరేకంగా నిర్ణయాలు చేసిందన్నారు. బడ్జెట్టుకు ముందుగానే జూన్ 25న రైల్వే ప్రయాణీకుల ఛార్జీలను 14.5 శాతం పెంచివేశారని, పెట్రోలు, డీజిలు, వంటగ్యాసు ధరలను పెంచారని, సెప్టెంబరు తర్వాత వీటితోపాటు కిరోసిన్, సహజవాయువు ధరలను పెద్దఎత్తున పెంచబోతున్నారంటూ ఇవన్నీ సామ్రాజ్యవాద, బడా కంపెనీల ప్రయోజనాలమేరకు చేస్తూ ప్రజలపై మరిన్ని భారాలు మోపుతున్నారన్నారు. రక్షణ రంగంలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించారని, బీమా రంగంలోకి విదేశీ పెట్టుబడులను పెంచారని, దాదాపు అన్ని రంగాలలోకి ఎఫ్‌డిఐకి గేట్లుతెరిచి సామ్రాజ్య వాదులకు దేశాన్ని ధారాదత్తం చేస్తున్న విధానాలు, చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.

ఉపాధి కల్పన, అవినీతి నిర్మూలనలకు ఈ బడ్జెట్టు వ్యతిరేకంగా వుందన్నారు. కోట్లాదిమందికి ఉపాధి కల్పించే వ్యవసాయరంగం యొక్క అభివృద్ధికి చర్యలు తీసుకోకుండా, విరుచుకుపడబోతున్న కరువు సహాయక, ఉపశమన చర్యల కోసం కాకుండా కొద్దిమంది ధనాఢ్యుల కోసం 60వేల కోట్లరూపాయల వ్యయంతో బుల్లెట్టు రైళ్ళ నిర్మాణం చేపట్టటం ఈ ప్రభుత్వ వర్గస్వభావాన్ని తేటతెల్లం చేస్తున్నదని, ప్రభుత్వ మోసపూరిత ప్రజా వ్యతిరేక విధానాలపై సమైక్యంగా ఉద్యమించాలన్నారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు వర్షంలోనే ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎర్రజెండాలు, బ్యానర్లు, ప్లకార్డులతో నినాదాలతో ప్రదర్శన స్ఫూర్తిదాయకంగా సాగింది. ప్రదర్శనకు ముందుభాగాన ప్రజా కళాకారుల డప్పునృత్యం, గిరిజన నృత్యాలు పట్టణ ప్రజలను ఆకట్టుకున్నాయి.

ఈ ప్రదర్శనలో ఇంకా ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ డివిఎన్ స్వామి, కా॥ గణేష్ పండా, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్. ఝాన్సి, కార్యదర్శి కా॥ కె. కోటయ్య, పార్టీ జిల్లా, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**(కేంద్రబడ్జెట్టును నిరసిస్తూ హైదరాబాదులో జరిగిన ధర్నా వివరాలు... వచ్చే సంచికలో)**





జనంపాటలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కా॥ కుండ్ల గంగరాజు; దివికుమార్; 'నెత్తుటిదీపాలు' కళారూపకం ప్రదర్శన

## రైతాంగ రుణాలన్నింటి... (8వపేజీ నుండి)

మరోవైపున నకిలీ విత్తనాలు రైతులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయన్నారు. వీటిని అరికట్టేపేరిట, రైతులు స్వంతంగా తయారుచేసుకునే విత్తనాలను కూడా, కంపెనీ బ్రాండ్ లేదనే పేరిట, నకిలీ విత్తనాలుగా నిర్ధారించి కేసులు బనాయిస్తున్నారన్నారు. కెనడాలో, బ్రెజిల్‌లో ప్రభుత్వమే రైతుల మీద అనేక కేసులు బనాయించి రాయల్టీలు వసూలు చేస్తున్నాయని పండిన పంటలో కూడా తమ జీన్స్ ఉన్నాయనే పేరిట ప్రభుత్వాలు, కంపెనీలు నష్టపరిహారం వసూలు చేస్తున్నాయన్నారు. కనుక బిటి విత్తనాలు వద్దనీ, విత్తనాలపై సామ్రాజ్యవాదుల పట్టు వద్దనీ డిమాండ్ చేయాలనీ ఆయన పిలుపునిచ్చారు. ప్రజలబాగోగులతో విత్తన కంపెనీలకు నిమిత్తంలేదనీ, లాభసముపార్జనే వారి ప్రధాన ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. కార్గిల్, మోన్‌సాంటో, డ్యూపాంట్ తదితర ప్రధాన విత్తన కంపెనీల చేతుల్లో 90 శాతం విత్తనాలున్నాయని, ఫలితంగా ఆయా దేశాలలో పంటల విధానాన్ని బహుళజాతి కంపెనీలే నిర్దేశిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అమెరికా ప్రపంచంలోని వివిధ దేశాలను అణచడానికి ప్రజలను దోచుకోవడానికి తుపాకీనే గాక సాంకేతిక పరిజ్ఞానమనే ఆయుధాన్ని కూడా ప్రయోగిస్తోందని విత్తనాలు, చమురు వనరులను చేతిలో పెట్టుకొని ప్రపంచాన్ని ఏలాలనుకుంటోందన్నారు. గుంటూరుజిల్లాలో రైతులే స్వంతంగా విత్తనాలు తయారుచేసుకొని పండించేందుకు, విత్తనాలపై హక్కును నిలుపుకునేందుకు కృషి ప్రారంభించారని వారందరికీ మద్దతునందించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కోశాధికారి **కా॥ వై.సోని** ప్రసంగిస్తూ పాలకులు ప్రకటించిన ఒక్కో సంక్షేమ పథకంలోని బూటకత్వాన్ని సోదాహరణంగా వెల్లడిచేశారు. భారత ప్రజానీకానికి అవసరమైన భూమి, ఆహారం, నివాసం, విద్య, వైద్యంవంటి మౌలిక సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర పాలకులు పూనుకోవటం లేదని, ప్రజలను సంక్షేమ పథకాల భ్రమలలో ముంచెత్తుతున్నారని రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్రసదస్సు రెండవ రోజు సెషన్‌లో ప్రసంగించిన సంఘం రాష్ట్ర అధ్యక్షులు **కా॥ యస్.ఝాన్సి** పేర్కొన్నారు. సదస్సు రెండవరోజున రాష్ట్రనాయకులు కామ్రేడ్స్ డి.వర్మ, యస్.లలితకుమారి, జె.వెంకటేశ్వరరావులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

కా॥ ఝాన్సీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ దేశంలో వ్యవసాయరంగం మీద ఆధారపడిన ప్రజల జీవన ప్రమాణాల పెంపుకుగానీ, ప్రజల ఆహారభద్రతకు గానీ ప్రభుత్వాలు ఎటువంటి చర్యలూ తీసుకోకపోగా, దేశ సంపదను వివిధ కార్పొరేటు, సామ్రాజ్యవాద గుత్తసంస్థలకు దోచిపెట్టడమే లక్ష్యంగా విధానాలను అమలుచేస్తున్నాయని పేర్కొన్నారు.

రైతుల రుణమాఫీపై మాట్లాడుతూ, చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాన్ని సాహసోపేతమైనదిగా కొన్ని వామపక్ష రైతు సంఘాలు అభివర్ణించటాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు.

భూ సంస్కరణ చట్టాల గురించి మాట్లాడుతూ తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట తదనంతర కాలంలో దీనిని తప్పనిసరై పాలకులు తీసుకువచ్చారని, అయితే దీనిని అమలుచేయకుండా ఆచరణలో నీరు గార్చారని పేర్కొన్నారు. శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట నేపథ్యంలో 1/70 చట్టం చేశారని, కానీ లక్షలాది ఎకరాల గిరిజనుల భూములన్నీ ఈనాటికీ గిరిజనేతరుల చేతిలోనేఉన్నాయని, భూబదలాయింపులు నిరోధించకపోగా, ప్రభుత్వమే ఆదివాసులను అడవుల నుండి గెంటివేస్తున్నదన్నారు.

ఉపాధిహామీ పథకం గురించి మాట్లాడుతూ వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించామని చెప్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతం నుండి వలసలను అరికట్టడంలో విఫలమయ్యారని, ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి మహానగరాలలో వలస కూలీలు దుర్భర జీవితాలు సాగిస్తూ, పెక్కు ప్రమాదాలలో అనేకులు దుర్మరణాల పాలవుతున్నారని ఇటీవలి చెన్నై భవన నిర్మాణ ప్రమాదాలను ఉటంకించారు. ప్రజలకు భూమిపై హక్కు కల్పించకుండా, ప్రతిరోజూ పనికోసం ఎదురుచూసే విధంగా పథకాలు రూపొందిస్తున్నారన్నారు.

ఆహారధాన్యాల ఉత్పత్తిని నిరుత్సాహపరుస్తూ, లక్షల ఎకరాల పంట భూములను సెజ్‌లు, కారిడార్ల పేరిట పడావుపెడ్తూ, ఒకవైపున ప్రభుత్వమే ఆహార అభద్రతను కల్పిస్తూ, మరోవైపున తామే ఆహారభద్రతను కల్పిస్తామనటాన్ని హాస్యాస్పదమైనదిగా పేర్కొన్నారు.

దళితుల రక్షణకోసమంటూ చేయబడిన చట్టాలేవీ సమర్ధవంతంగా అమలుకావటంలేదని, చుండూరు ఘటనలో ఇటీవలి హైకోర్టు తీర్పును ఆమె ఉదహరించారు. లక్షింపేట దళితుల హత్యాకాండ ఘటనలోనూ దోషులు – కులం, అధికారం, డబ్బు, పలుకుబడిలను ఉపయోగించి తప్పించుకోజూస్తున్నారన్నారు. కనుక చట్టాలఅమలుకోసం పోరాడుతూనే, చట్టాలలోని లొసుగులను విడమరిచి, ప్రజల చైతన్యాన్ని ప్రక్కదారి పట్టించే కుట్రలను ఓడించాలన్నారు. దళితులకు భూమిపై హక్కు కల్పించాలని ఉద్యమించాలన్నారు.

పంచాయితీరాజ్ విస్తరణ చట్టం ఉనికిలో వున్నప్పటికీ విశాఖజిల్లాలో బాక్సైటు తవ్వకాల కోసం ఆదివాసులను గెంటివేసి భూములను జిందాల్, అన్‌రాక్‌లకు కట్టబెడుతున్నారన్నారు. సహజవనరులు ఆ ప్రాంత ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడకపోగా, వారంతా నిర్వాసితులై, తీవ్ర కాలుష్యం, పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు.

గత ఆరున్నర దశాబ్దాలపైగా భారత పాలకులు వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాదుల రథచక్రాలకు కట్టివేసిన ఫలితమే నేటి ఈ దుస్థితి అని ఆమె వివరించారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య వంతుల్ని చేసి భూమిమీద, అడవిమీద, సహజవనరుల మీద తమ హక్కుకోసం ఉద్యమింపజేయాలని ఆమె పిలుపునిచ్చారు.

భూమిహీనులైన ప్రజలకు భూమి పంపిణీ చేయకపోగా, వివిధ ప్రాజెక్టులు, గనులు, పథకాల పేరుతో పేదలను, ఆదివాసులను నిర్దాక్షిణ్యంగా అడవులనుండి, వారి భూములనుండి తరిమివేస్తున్నారని పేర్కొన్నారు. మద్యం, మత్తుపదార్ధాల వ్యాపారాలను పాలకులు ప్రోత్సహిస్తూ ప్రజలను మత్తులో ముంచెత్తుతున్నారని, మరోవైపున ఇంటర్‌నెట్ ద్వారా, అశ్లీల సినిమాల ద్వారా సామ్రాజ్యవాద విషసంస్కృతిని విచ్చలవిడిగా వెదజల్లుతూ ప్రజలను ప్రక్కదోవ పట్టిస్తున్నారని ఆమె చెప్పారు. ఇంకోవైపున కుల, మత, ప్రాంతీయ విబేధాలను పెంచిపోషిస్తూ, ప్రజల మధ్య ఐక్యతకు గండికొడ్తున్నారన్నారు. వీటిని అధిగమించి ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి వీధుల్లోకి వస్తే, నిర్బంధ పోలీసు యంత్రాంగంతో వారిని అణచివేస్తున్నారని ఆమె పేర్కొంటూ పాలకుల ఈ కుట్రపూరిత విధానాలకు వ్యతిరేకంగా సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

విశాల భూఖండాలను పడావుబెట్టే పాలకుల నీటిపారుదల విధానంపై 'జనశక్తి' పత్రిక సంపాదకులు **కా॥ పి. జస్వంతరావు** ప్రధానంగా ప్రసంగించారు. రాష్ట్రం రెండుగా విభజించబడిన తర్వాత, ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ప్రజల మధ్య వైషమ్యాలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. గత ఆరున్నర దశాబ్దాలపైగా కాలంలో భారత పాలకులు అనుసరిస్తూ వచ్చిన నీటిపారుదల పథకాల గురించి ఆయన వివరిస్తూ, నేటికీ 30-35 శాతం భూమికి మాత్రమే స్థిరమైన నీటివసతి వుందని, ఇందులో 15 శాతం రైతులు తమ స్వంతంగా కల్పించుకున్నదేనని ఆయన పేర్కొన్నారు. దేశంలోని విశాల ప్రాంతాలకు నీటి పారుదల సౌకర్యాలు కల్పించకుండా కరువుపీడిత ప్రాంతాలుగా వుంచి, చౌక కూలీల ఎగుమతి కేంద్రాలుగా శాశ్వతమొనర్చటం పాలకుల కుటిల విధానాలలో భాగమేనని ఆయన అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్వాపరాల గురించి వివరిస్తూ, ఈ ప్రాజెక్టు సాగునీటి అవసరాల కోసం ఉద్దేశించినది కాదని నిర్ద్వందంగా తేల్చిచెప్పారు. పెట్రోకారిడార్‌లో నిర్మించనున్న ప్రమాదకర, కాలుష్యభరిత పరిశ్రమల నీటి అవసరాలకోసమూ, ఈ పరిశ్రమలకు కావలసిన విద్యుత్తు అవసరాలకోసం, జల రవాణాకోసం దీనిని నిర్మిస్తున్నారని ఆయన స్పష్టంచేశారు. కృష్ణా, గోదావరి డెల్టాల స్థిరీకరణ అని చెప్పేది కూడా ఆయా ప్రాంత రైతాంగాన్ని ప్రాజెక్టుకు అనుకూలంగా మలచుకోవటం కోసమేనని ఆయన చెప్పారు. మూడు జిల్లాలలోని, 9 మండలాల పరిధిలో, వందలాది గ్రామాల్లో, లక్షలాది ఆదివాసులను నిర్వాసితులు చేస్తూ, లక్షల హెక్టార్ల అటవీ భూములను ముంపుకు గురిచేస్తోన్న ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వేలకోట్ల ప్రజాధనాన్ని వెచ్చించటమేనా అభివృద్ధి అంటే అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు క్రింద జలసమాధి కాబడుతున్న ఆదివాసుల సమగ్ర పునరావాసాన్ని ఆయన డిమాండ్‌చేశారు.

పీడిత ప్రజా ఉద్యమ నాయకుడు, విప్లవ మేధావి కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 38వ వర్ధంతి సందర్భాన్ని పేర్కొంటూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయ కార్యదర్శి **జె. కిషోర్‌బాబు** కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి జీవిత విశేషాలను వివరించారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినా, పీడిత ప్రజా ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన త్యాగమయ జీవితాన్ని గుర్తుచేశారు. భారతదేశంలో విప్లవం విజయవంతంకావటానికి సరైన పంథా రూపొందించటంలో కా॥ తరిమెల నాగిరెడ్డి పాత్రను వివరించారు.

పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని, దున్నేవానికే భూమి నినాదంగా భూస్వామ్య వ్యతిరేకపోరాటాల్ని సాగించాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పిన కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డికి తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి కా॥ జస్వంతరావు జోహార్లర్పించారు. వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాదులకు లోబరిచిన, భారత పాలకుల దోపిడీ విధానాలను శక్తివంతంగా వెల్లడి చేసిన మార్క్సిస్టు, లెనినిస్టు మేధావి తరిమెల నాగిరెడ్డి అని కొనియాడారు.

ప్రజల అవసరాల్ని తీర్చటం కోసం కాకుండా, వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాద మార్కెట్ అవసరాల్ని తీర్చటానికే పైరుపచ్చ విప్లవం, మరో పైరుపచ్చ విప్లవాలను పాలకులు రైతాంగంపై రుద్దుతున్నారన్నారు. సామ్రాజ్యవాదుల ఉత్పత్తులను వినియోగించే రంగంగా వ్యవసాయాన్ని మలిచారని పేర్కొన్నారు. సహకార బ్యాంకుల ద్వారా అందజేసిన రుణాలు కూడా గ్రామాల్లో భూస్వామ్య వర్గాలను బలీయం చేయటానికే తోడ్పడ్డాయన్నారు. ఈ దేశంలో భూస్వామ్య విధానానికి కాలం చెల్లిందని, పెట్టుబడిదారీ వ్యవసాయం సాగుతోందని కొందరు అంటున్నారని, కానీ దేశంలో ఈనాటికీ 60 శాతం సాగుభూమి 10 శాతం కుటుంబాల చేతుల్లో ఉందని పేర్కొంటూ పెట్టుబడిదారీ సంబంధాలు నెలకొనటమే పెట్టుబడిదారీ వ్యవసాయం కాబోదన్నారు.

గ్రామాల్లో దళితులపై దాడులు తీవ్రమౌతున్నాయని, బిజెపి తన ప్రాబల్యం పెంచుకునేందుకు ముజఫర్‌నగర్‌లో మతఘర్షణలను సృష్టించిందని, దాడులకు భీతిల్లి సహాయశిబిరాలలో తలదాచుకుంటున్న ముస్లిం రైతాంగం యొక్క భూములను భూస్వాములు పంటతోసహా స్వాధీనం చేసుకున్నారన్నారు. దేశంలో జరుగుతున్న మతోన్మాద దాడులన్నీ దోపిడీవర్గ ప్రయోజనాల్ని కాపాడేందుకే తోడ్పడుతున్నాయని పేర్కొంటూ భూస్వామ్య, సామ్రాజ్య వ్యతిరేక పోరాటాలను తీవ్రం చేయాల్సిన ఆవశ్యకతను కామ్రేడ్ జస్వంతరావు నొక్కిచెప్పారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥ కె. కోటయ్య మాట్లాడుతూ ఈ వ్యవస్థపట్ల, రైతాంగ సమస్యల పరిష్కారంపట్ల ఒక స్పష్టమైన అవగాహనతో, సుదీర్ఘకాలంగా ఎన్నో ఆటంకాలను, నిర్బంధాలను ఎదుర్కొంటూ కృషి సాగిస్తూ వస్తున్నామని చెప్పారు. రైతుకూలీ సంఘం ఒక వర్గసంఘంగా పీడిత ప్రజల హక్కుల సాధనకు, రైతాంగ సమస్యల పరిష్కారానికి, ప్రజలకు తోడ్పడే చట్టాల సక్రమ అమలుకొరకు పోరాడాలని, కీలకమైన 'దున్నేవానికే భూమి' నినాదంగా వ్యవసాయక విప్లవ లక్ష్యంతో నిర్మాణయుతం, సంఘటితంకావాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న కాలంలో పాలకులు ప్రజలపై మరిన్ని భారాలను మోపనున్నారని, నిర్బంధాన్ని తీవ్రతరం చేయనున్నారనేది గుర్తెరిగి, పీడిత రైతాంగ, ప్రజా ఉద్యమాలను పట్టుదలగా, మరింత శక్తివంతంగా నిర్మాణం చేసేందుకు ఈ రాష్ట్ర సదస్సు స్ఫూర్తినిస్తోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తూ, సదస్సు నిర్వహణకు బాధ్యత వహించిన గుంటూరుజిల్లా కమిటీకి అభినందనలు తెలియచేశారు.

అనంతరం రైతాంగం, ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సు అనేక తీర్మానాలను ఆమోదించింది. **(తీర్మానాలు వచ్చే సంచికలో)**

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు కామ్రేడ్ ముత్తిరెడ్డి శ్రీరాములు రెండు రోజుల ఈ సదస్సుకు హాజరై చురుగ్గా పాల్గొన్నారు. రాష్ట్ర కార్యవర్గం ఆయనను వేదికపైకి ఆహ్వానించి వయోభారాన్ని లెక్కచేయని ఆయన స్ఫూర్తిదాయకమైన జీవిత విశేషాలను వివరించి అభినందనలు తెలియజేసింది.

ప్రజాకళాకారుల సమాఖ్య ప్రచురించిన 'జనంపాటలు' పుస్తకాన్ని కొండమొదలు గిరిజన నాయకుడు, ప్రజాకళాకారుడు కుండ్ల గంగరాజు ఈ సదస్సులో ఆవిష్కరించారు. సదస్సులో ప్రజా కళాకారులు పాడిన పాటలు, ప్రదర్శించిన కళారూపాలు ప్రతినిధులను ఆకట్టుకున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుండి దాదాపు 500 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ✡

# ‘విప్లవపంధా అమలుకోసం రాజీలేని పోరాటం చేసిన యోధుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి’

## కామ్రేడ్ టి.ఎన్. 38వ వర్ధంతి సభలో ఎస్. ఝాన్సి ఘనమైన నివాళి



విజయవాడలో టి.ఎన్. వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ ఝాన్సి; అనంతపురంలో టి.ఎన్. వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి; టి.ఎన్.ఎమ్. ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాదులో పుస్తకావిష్కరణ సభ

**విజయవాడ, 31-7-14 :**

విప్లవ యోధుడు, మార్క్సిస్టు మేధావి తరిమెల నాగిరెడ్డి 38వ వర్ధంతి సభ విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో పార్టీ జిల్లా నాయకులు కా॥ సోని అధ్యక్షతన జరిగింది. సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు ఎస్. ఝాన్సి మాట్లాడుతూ, కా॥ టి.ఎన్. భారతదేశంలో విప్లవాన్ని విజయవంతం చేయటానికి, విప్లవకారులు రూపొందించుకున్న పంథాను అమలు చేయటం కోసం అతివాద, మితవాద విధానాలపై రాజీలేనిపోరాటం చేసిన విప్లవ యోధుడని పేర్కొన్నారు. కామ్రేడ్ నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఆమె ఘనంగా నివాళులర్పించారు. ఆమె తన ఉపన్యాసంలో, ఎంతో విప్లవ నిబద్ధతకల్గిన విప్లవ నాయకుడిగా కా॥ టి.ఎన్. కృషిసాగించారనీ, ఎమర్జెన్సీ కాలంలో సరైన వైద్యసౌకర్యం లేక టి.యన్‌ని అకాలంగా కోల్పోయామనీ, విప్లవ పంథాను ముందుకు తీసుకెళ్ళే వెయ్యిమంది కార్యకర్తలను తయారుచేయాలని నిర్ణయించుకున్న రెండు నెలలకే కా॥ టి.ఎన్. చనిపోయారనీ, ఆయన లేకపోవడం భారత విప్లవోద్యమానికి తీరని లోటనీ, ఆయన చూపిన బాటలోనే గిరిజన ప్రాంతాల్లో ఉద్యమాన్ని నిలబెట్టుకుంటూ, మైదాన ప్రాంతాల్లో వివిధ రంగాల్లోని ప్రజల సమస్యలపై ఉద్యమాలు సాగిస్తూ ఉన్నామనీ, పెదధోరణులకు వ్యతిరేకంగా పోరాటంచేస్తూ టి.ఎన్. చూపిన బాటలో విప్లవ లక్ష్యాన్ని సాధిస్తామని, అదే టి.ఎన్.కి మనమిచ్చే ఘనమైన నివాళి అవుతుందని చెప్పారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వి. అంజిరెడ్డి మాట్లాడుతూ, తరిమెల నాగిరెడ్డి మంచి దార్శనికత, నాయకత్వపటిమ, త్యాగనిరతి కల్గిన నాయకుడనీ, ఎంతోమంది రాజకీయ నాయకులు వుండవచ్చు కానీ నాగిరెడ్డి లాంటి నాయకులు అరుదుగా వుంటారని పేర్కొన్నారు. భారత పాలకవర్గాల వర్గస్వభావాన్నీ, రాజకీయ మార్పులను, వ్యవస్థాపరంగా జరిగిన మౌలిక పరివర్తనను స్థూల స్థాయిలో విశ్లేషణ చేసిన ‘తాకట్టులో భారతదేశం’ గ్రంథం ఎనలేనిప్రాముఖ్యతను సంతరించుకొందనీ, అందులో విప్లవ కార్యాచరణకు కావాల్సిన సైద్ధాంతిక అంశాలను పొందుపరిచారనీ, కావున అంతటి విశిష్టత నాగిరెడ్డి కోర్టు స్టేట్‌మెంట్‌కి వచ్చిందని చెప్పారు.

అతివాదుల నుంచి తీవ్రమైన రాజకీయ దాడులు ఎదురైనా నాగిరెడ్డి వాటిని నిబ్బరంగా ఎదుర్కొని విప్లవపంథా విశిష్టతను ఎలుగెత్తి చాటారని పార్టీ రాష్ట్ర నాయకులు కా॥ కొప్పుల కోటయ్య కొనియాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ, నాగిరెడ్డి వదిలి వెళ్ళిన నిరంతర శ్రమ, అధ్యయనం, పోరాట తత్వాన్ని అలవరచుకొని ముందుకు సాగాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు వేములపల్లి వేమనరావు సంక్షోభంలోవున్న రైతాంగాన్నిఆదుకొనే చర్యలు గురించి ఆలోచించాలన్నారు.

**అనంతపురం, 28-7-14 :**

సిపిఐ(ఎం-ఎల్) అనంతపురం జిల్లా కమిటి ఆధ్వర్యంలో కా॥ టి.ఎన్. వర్ధంతిసభ స్ఫూర్తిదాయకంగా జరిగింది. జూలై 28 ఉదయం పది గంటలకు నగరంలోని టవర్‌క్లాక్ వద్ద వున్న కా॥ తరిమెల నాగిరెడ్డి విగ్రహానికి ప్రొ॥ కె. ఆర్. చౌదరి, సింగమనేని నారాయణ, సూర్యసాగర్, కామ్రేడ్స్ పెద్దన్న, తిమ్మారెడ్డి; ఎమ్.వి. రమణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆ తరువాత తరిమెల గ్రామానికి వెళ్ళి, అక్కడి స్థానిక ప్రజలతో కలసి కా॥ తరిమెల నాగిరెడ్డి స్థూపం వద్ద జోహార్లర్పించారు. అమరులకు జోహారులర్పిస్తూ ఊరేగింపు జరిపారు. స్థూపం వద్ద ప్రజలనుద్దేశించి కా॥ పెద్దన్న, ప్రొ॥ కె.ఆర్. చౌదరి ప్రసంగించారు. కా॥ టి.ఎన్ వంటి గొప్ప ప్రజావిప్లవ నాయకున్ని అందించిన తరిమెల గ్రామం ధన్యమైనదని నివాళులర్పించారు.

అదేరోజు సాయంత్రం అనంతపురం పట్టణంలో వందలాదిఅభిమానులతో, ప్రజాకళాకారుల నృత్యాలతో కా॥ టి.ఎన్. శ్రామిక భవనం వద్ద నుండి ప్రదర్శన జరిగింది. ప్రజలు ఆసక్తితో వీక్షించారు. లలిత కళా పరిషత్తు హాలులో జరిగిన కా॥ టి.ఎన్. వర్ధంతి సభకు పార్టీ జిల్లా కార్యదర్శి కా॥ పెద్దన్న అధ్యక్షత వహించారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కా॥ టి.ఎన్. విప్లవకర పాత్రను, అతివాద, మితవాదాలను ఎదుర్కొని సరైన విప్లవ కమ్యూనిస్టు **(తరువాయి 6వ పేజీలో)**

# ‘రైతాంగ రుణాలన్నింటి రద్దుకై, వ్యవసాయాన్ని కాపాడుకునేందుకై ఉద్యమించండి’

## రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్రసదస్సు పిలుపు



రాష్ట్ర సదస్సుకు హాజరైన ప్రతినిధులు; సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి; వేదికపై కామ్రేడ్స్ ఝాన్సి, కె. కోటయ్య, అధ్యక్షవర్గం; ప్రసంగిస్తున్న డా॥ జస్వంతరావు, డా॥ కొల్లా రాజమోహన్, కా॥ వై.సోని, కా॥ జె. కిషోర్‌బాబు

**గుంటూరు,2014 జులై 27,28 తేదీలు :**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్‌లో జరిగిన రెండురోజుల రాష్ట్ర సదస్సు మొదటి సెషన్‌కు సంఘం రాష్ట్రనాయకులు కామ్రేడ్స్ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, ఎమ్ఎస్ నాగరాజు, జి.సునీత అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయని, అయినప్పటికీ గత ప్రభుత్వాల విధానాలనే వారు మౌలికంగా అమలు చేస్తూ వస్తున్నారని, ఫలితంగా రైతాంగ సమస్యలు మరింత తీవ్రం కాబోతున్నాయని రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్. ఝాన్సి పేర్కొన్నారు. అధికార పార్టీలు చేసిన వాగ్దానాల అమలు కోసం, పెనువిపత్తుగా ముందుకురానున్న కరువు పరిస్థితులనందుకునే చర్యల కోసం, రైతులు, కూలీలు, గ్రామీణ పేదలంతా సమస్యలపై తమ అవగాహనను స్పష్టంచేసుకొని, పరిష్కారం కోసం ఉద్యమాలలో సంఘటితంకావాల్సిన అవసరముందంటూ, ఈ నేపధ్యంలో రెండు రోజుల సదస్సును నిర్వహిస్తున్నట్లు, ఆమె పేర్కొన్నారు. తదనంతరం అమరులకు సంతాపం తెలుపుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

ఎఐకెఎమ్‌కెఎస్ అఖిల భారత కమిటి నాయకులు కామ్రేడ్స్ సురేంద్రసింగ్ ఖతియార్, ఉత్తరప్రదేశ్ రైతాంగ ఉద్యమ నాయకులు ఉమాశంకర సింగ్; రైతుకూలీ ఉద్యమ నాయకులు మాదాల నారాయణస్వామి; ఇంకా పరకాల పట్టాభి రామారావు, కానేటి మోహనరావులకు; ఉద్యమశ్రేయాభిలాషులు, ప్రజాతంత్రవాదులు పి.ఏ.చౌదరి, పద్మనాభరెడ్డి, ఛాయరాజ్, దొప్పల ఆంజనేయమూర్తి, కొండు కృష్ణయ్య, తదితరులందరికీ సదస్సు జోహార్లర్పించింది. ఇజ్రాయిల్ దాడులలో మృతులైన పాలస్తీనీయులకు; గ్యాస్‌పైపులైను ప్రేలుడు (నగరం) మృతులకు; భవన నిర్మాణ ప్రమాదాల(చెన్నై)లో మృతిచెందిన వలస కార్మికులకు; మెదక్‌జిల్లా మాసాయిపేట రైల్వే లెవెల్ క్రాసింగ్ ఘటనలో చిన్నారుల మృతి పట్ల రాష్ట్రసదస్సు తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. అమరుల స్మృతిలో సదస్సు ప్రతినిధులంతా లేచి నిలబడి మౌనం పాటించారు.

రైతాంగ రుణభారం సమస్యపై విశ్లేషణాత్మక ప్రసంగం చేసిన ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి... భూసంస్కరణలు కేంద్రంగా రైతుల రుణమాఫీతో సహా వ్యవసాయక సమస్యల పరిష్కారం ముడిబడివుందని పేర్కొన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ భారత ఆర్థిక వ్యవస్థ గురించి వలసవాదుల కాలంలో రజనీపామీదత్తు, తదనంతర కాలంలో తరిమెల నాగిరెడ్డి సరైన, సమగ్ర విశ్లేషణలు చేశారన్నారు. సామ్రాజ్య వాదులకు దాసోహం చేసిన పాలకులు... రైతాంగ సబ్సిడీలను క్రమంగా తగ్గించుతూ, వ్యవసాయ అవసరాల ఖర్చును విపరీతంగా పెంచి రైతులకు సాగును భారంగా మార్చారన్నారు. చంద్రబాబు రుణమాఫీ వాగ్దానాలకు, వాటి అమలుపేరిట ప్రకటిస్తున్న చర్యలకు పొంతన లేదన్నారు. రైతాంగ రుణాలన్నీ రద్దుచేస్తానని హామీయిచ్చిన చంద్రబాబు, దీర్ఘకాలిక రుణాలు, బంగారు రుణాలు, పంట రుణాలను మొత్తంగా రద్దుచేయబోవటం లేదనీ, కుటుంబానికి లక్షన్నర రూ॥ల చొప్పున రుణమాఫీ చేయబోతున్నానని చెప్తున్నాడన్నారు.

దీనివలన కౌలురైతులకు లబ్ధిచేకూరేదిలేదనీ, వ్యవసాయ ఖర్చులో 70 శాతంగా వున్న సన్న, చిన్నకారురైతుల ప్రైవేటు పంటరుణాల గురించి చంద్రబాబు మాట్లాడటం లేదన్నారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటి 87, 612 కోట్ల రైతుల రుణబకాయిలున్నాయని పేర్కొన్నదని, వీటి రద్దుతోనే బ్యాంకింగ్ వ్యవస్థ తల్లకిందులవుతుందని చెప్పటాన్ని ఆయన ఎద్దేవా చేశారు. గత 10 సం॥ల కాలంలో 35 లక్షల కోట్ల రూ॥ల బడా కార్పొరేటు సంస్థల మొండి బకాయిలను రద్దుచేయటంతో పోల్చినా; ప్రతి సం॥రం సామ్రాజ్యవాద, బడాసంస్థలకు కట్టబెట్టే వేలకోట్ల రూ॥ల రాయితీలతోపోల్చినా, రైతుల రుణమాఫీ ఓ లెక్కలోనిది కాదన్నారు. బ్యాంకులు మొత్తంగా ఇచ్చే రుణాలలో 18 శాతం రైతాంగ రుణాలున్నాయని చెప్తున్నప్పటికీ, ఇందులో వాస్తవానికి సన్న, చిన్నకారు రైతులకు అందుతున్నది బహుస్వల్పమని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ నగరంలో 4,500 కోట్ల రూ॥ల బ్యాంకు రైతురుణాల ఖాతాలు వుండటమంటేనే; మహారాష్ట్రలోని మొత్తం రైతాంగ రుణాలలో సగభాగం రుణఖాతాలు బొంబాయి నగరంలో వుండటమంటేనే-రైతురుణాల బండారమేమిటో తేలుతోందన్నారు. 25 రాష్ట్రాలలో 90వేల రైతాంగ రుణ ఖాతాదారులను విచారించి ‘కాగ్’ ఇచ్చిన నివేదికలో 20 వేల ఖాతాలు అక్రమమైనవని, 20వేల ఖాతాదారులు తప్పుడు ధృవపత్రాలుచూపారని, 14శాతం లబ్ధిదారులకు రుణ అర్హతే లేదని తేల్చి చెప్పిందన్నారు. ఈ పరిస్థితులలో కౌలురైతులతో సహా సన్న, చిన్నకారు రైతాంగం యొక్క పంట, బంగారు, ప్రైవేటు రుణాలన్నింటి రద్దుకై పోరాడాలని ఆయన పిలుపు నిచ్చారు.

నల్లమడ రైతాంగ ఉద్యమ నాయకులు **డా॥ కొల్లా రాజమోహన్** విత్తనాలపై సామ్రాజ్యవాదుల పట్టు గురించి మాట్లాడారు. తన పంటలోని మేలైన విత్తనాలను తీసి, శుద్ధిచేసి, దాచి, మరుసటి పంటకు వినియోగించుకునే రైతు నుండి విత్తనాలు దూరం చేయబడ్డాయన్నారు. ఇలా సమకూర్చుకున్న విత్తనాలను గ్రామంలో రైతులు పరస్పరం ఇచ్చిపుచ్చుకునేవారని, ఈవిధంగా కొన్ని వందల సంవత్సరాలుగా రైతుచేతిలో వున్న విత్తనాన్ని సామ్రాజ్యవాద కంపెనీలు ఎగరేసు కెళ్ళాయన్నారు.

అమెరికాకు చెందిన మాన్‌సాంటో కంపెనీ బిటి పత్తి విత్తనాలను ప్రవేశపెట్టి, రైతులను పెద్దఎత్తున ఆర్థికంగా దోచుకొంటోందని మరోవైపున దిగుబడులలో ఆశించిన ఫలితాలేమీలేకపోగా, పర్యావరణం విషతుల్య మౌతున్నదన్నారు. దీనిపట్ల రైతుల, ప్రజాతంత్ర మేధావుల, ప్రజల వ్యతిరేకతలను లెక్కచేయకుండా వివిధ రకాల పంటలలో బిటి విత్తనాలను ప్రవేశ పెడ్తున్నారని, ఇది తీవ్రదుష్ఫలితాలను కలుగ జేస్తుందన్నారు. **(తరువాయి 7వ పేజీలో)**

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010